# ప్రతి 'భవిత' విద్యార్థికి ప్రొఫైల్ సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.




**కరీంనగర్ బ్యూరో, మార్చి 13, (ప్రజా జ్యోతి):** భవిత కేంద్రాలలో ప్రత్యేక విద్య నేర్చుకుంటున్న ప్రతి దివ్యాంగ విద్యార్థికి ప్రొఫైల్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్ లతో గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు మంజూరు చేసే యూ డి ఐ డి కార్డుల పట్ల భవిత విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రత్యేక విద్యను అభ్యసించే ఉపాధ్యాయులు

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

శుక్రవారం | 14 | మార్చి | 2025 ◆ పేజీలు : 11




- సురక్షితంగా జరుపుకోవాలి
- హోలీ రోజున కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

**జగిత్యాల బ్యూరో, మార్చి13, ప్రజా జ్యోతి:** 'హోలీ' అంటే రంగులు చల్లుకునే పండుగ కాదు. కానీ ప్రస్తుత కాలంలో రంగుల పండుగగా స్థిరపడింది. ఈ పండుగ మహాభారతకాలం నుండే వాడుకలో ఉంది. "హోళీక" అనేది స్త్రీ రాక్షస దేవత. ఈవిడ బ్రహ్మచే సృష్టించబడిన రావణాబ్రహ్మ సోదరి. ఈ హోళికను అందరూ దేవతగా కుల దైవంగా పూజించేవారు. సంతానం లేనివారు ఈమెను పూజిస్తే సంతానవతులవుతారు అని నమ్మేవారు. ఈ రంగుల హోలీ గురించి పండితులు ఈ క్రింది విధంగా వివరిస్తూ మహాభారత కాలంలో "బృహద్రధుడు" అను ఒక రాజు ఉండేవాడు. ఆ రాజులకు ఇరువురు భార్యలు. వారికి సంతానం లేక పోవుటచే హోళికను పూజించమని చెప్పారట. వారు హోళికారాక్షసి బొమ్మను గోడపై చిత్రించుకుని పూజలు చేశారట. వారు చేసిన పూజలు ఫలించి వారికి ఒక పండు లభించింది. ఇరువురు భార్యలు ఉన్నారు కనుక వారు ఆ పండును రెండు భాగములుగా చేసి భుజించినారట. సగం-సగం శరీరభాగాలతో వారికి శిశువులు కలిగారట. వారు అలా శిశువులను చూసి తట్టుకొనలేక ఆ రెండు శరీర భాగములు సంధిచేసి (అనగా అతికించి) ఒక్క ఆకారంగా చేశారట. ఆ శరీరమే జరాసంధుడు ఆట. ఈ హోలీ పండుగను సత్యయుగం నుండి జరుపుకుంటు న్నట్లుగా పురాణాలు తెలుపుతున్నాయి అని వివరించారు. 'హోళీ' అంటే 'అగ్నిపునీత' అని అర్థం. ఈ పండుగ ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసం పౌర్ణమిరోజున వస్తుంది. కనుక ఈ పండుగను వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల్లో పిలుస్తుంటారు 'హోళీ' కామునిపున్నమి', 'దోలికోత్సవం' అని కూడా పిలుస్తారు. హోలీ అంటే అసలు తత్త్వం మరచి పోయి కాలాను గుణంగా రంగులపండుగగా జరుపుకునే ఆనవాయితీకి ప్రజలందరూ అలవాటుపడ్డారు. కానీ భారతీయ సాంప్రదాయంలోని అసలు తత్త్వం తెలుసుకుంటే

మిగతా 2 లో...

# హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలి

- హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవు
- పోలీసు కమీషనర్ గౌస్ ఆలం.




**కరీంనగర్ క్రైం,మార్చి 13,ప్రజాజ్యోతి:** శుక్రవారం హోలీ పండుగ పురస్కరించుకుని వేడుకల్ని సురక్షితంగా,బాధ్యతతో జరుపుకోవాలని కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌస్ ఆలం సూచించారు.హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు,చర్మానికి,పర్యావరణానికి హానికరం కాని సహజ రంగులను ఉపయోగించాలని నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడొద్దని తెలిపారు, ఇతరులపై బలవంతంగా రంగులు వేయకుడదని ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం,శారీరక లేదా మానసిక వేధింపులకు గురిచేయడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందన్నారు,పబ్లిక్ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్లకు కాల్ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రజలకు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. చెరువులు,కుంటల్లో

మిగతా 2 లో...

# విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన

- విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా
- 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాల పెంపు లక్ష్యం
- ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన విద్యాశాఖ కార్యదర్శి
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.




**ప్రజాజ్యోతి, ఎల్లారెడ్డిపేట, మార్చి, 13:** ఈ నెల 15 వ తేదీ నుంచి జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏ.ఐ ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి

మిగతా 2 లో...

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాలు పూర్తి చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.



**జగిత్యాల బ్యూరో మార్చి 13 ప్రజాజ్యోతి:** మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న

మిగతా 2 లో...

## విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన.

(మొదటి పేజీ తరువాయి... )

విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , విద్యాశాఖ సంచాలకుల నరసింహా రెడ్డి తో కలిసి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఫిబ్రవరి నెలలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించామని, అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి జిల్లాలో కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ముందస్తుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏ.ఐ వినియోగిస్తూ సులభతరంగా విద్యా బోధన చేయాలని అన్నారు. ఏ.ఐ. కోర్సు ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్ ఫోన్స్ ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. జిల్లాలో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలలో ఏ ఏ కోర్సు ద్వారా విద్య బోధన జరుగుతుందని, ఇక్కడ వచ్చే ఫలితాలను అంచనా వేస్తూ భవిష్యత్తులో దీన్ని మరింత విస్తరించి ఎందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ లను ఉపయోగించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు ముందుగా విద్యార్థులు తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారితో వారికి ఎఫ్ఎల్ఎం తో వచ్చే ఫలితాలను వివరించాలని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చదవడం రాయడం లో ఇలాంటి ఇబ్బంది పడకుండా చూడాలని ఉంది ప్రధాన ఉద్దేశమని, కంప్యూటర్లు ఇతర సామాగ్రి కోసం స్వచ్ఛంద సంస్థలను ఇతర సంస్థలను నుంచి సహాయం తీసుకోవచ్చు అని తెలిపారు అలాగే ఆయా జిల్లాల్లో అవసరమైన సామాగ్రి ఇతర పరికరాలు వివరాలను తమకు పంపించాలని సెక్రెటరీ విద్యాశాఖ సెక్రటరీ సూచించారు.

## ప్రతి 'భవిత' విద్యార్థికి ప్రొఫైల్ సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి... )

అన్ని భవిత సెంటర్లను సందర్శించాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులు తమ పనులు తాము చేసుకునే విధంగా నేర్పించాలని సూచించారు. భవిత కేంద్రాలకు కావలసిన ప్రత్యేక వస్తువులు, ఆట పరికరాలు, సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. అందుకు సంబంధించి కావాల్సిన అవసరాల వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. మేనరిక వివాహాల అనర్థాలు, గర్భిణిగా ఉన్నప్పుడు టీఫా స్కాన్ వల్ల కలిగే ప్రయోజనాలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవిత కోఆర్డినేటర్ ఆంజనేయులు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఐ.ఈ.ఆర్.పిలు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలి



(మొదటి పేజీ తరువాయి... )

లోతైన నీటి లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని కోరారు.పండుగ వేళ మహిళలను వేధింపులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ హోలీ పండుగ ప్రేమ,ఐక్యత,సంతోషాన్ని విస్తరించేలా ప్రతి ఒక్కరి జీవితంలో తెచ్చి పెట్టాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు.

# నేడే హోలీ

(మొదటి పేజీ తరువాయి... )

దీనికి పురాణాల ప్రకారం ఒక కథ ప్రచారంలో ఉంది. 'హిరణ్యకశివుడు' రాక్షసరాజు, అతని కుమారుడు ప్రహ్లాదుడు. అతనిని విద్యకొరకు ఆచార్యుల వద్దకు పంపుతాడు. కానీ అక్కడ ప్రహ్లాదుడు హరినామ స్మరణతోనే తన తోటి విద్యార్థులతో విద్యను అభ్యసించుచూ హరిభక్తిలో లీనమవుతాడు. అది తెలిసిన అతని తండ్రి హిరణ్యకశిపుడు తన పుత్రుని బ్రతిమిలాడి, బుజ్జగించి హరిభక్తిని విడనాడమంటాడు. కానీ ప్రహ్లాదుడు హరినామస్మరణే జీవిత పరమార్థమని చెప్పి తండ్రిమాటను వినడు. హిరణ్యకశిపుడు హరివైరి. కనుక హరిని సేవించే తన కుమారుని తన శత్రువుగా భావించి ప్రహ్లాదుని అంత మొందింపదలచి తన సేవకులను పిలిచి పిల్లవానిని వారికి అప్పగించి ఏనుగులతో తొక్కించడం. లోయలో పడ చేయడం, పాములతో కరిపించడం చేయిస్తాడు.కానీ ఆ సమయంలో కూడా హరిభక్తివీడక 'నారాయణ' నామస్మరణచేస్తూ ఉంటాడు ప్రహ్లాదుడు, విష్ణు మహిమ వలన అతనికి ఎటువంటి బాధ కలుగదు. అది గమనించిన హిరణ్యకశిపుడు తనసోదరి హోళికను పిలిపించుతాడు. ఎందుకంటే హోళికకు వరప్రభావం వలన ఆమె వద్ద ఒక శాలువ' ఉంటుంది ఆ శాలువ ఆమె ఒంటిమీద ఉన్నంతవరకు మంటలు ఆమెను అంటుకొనలేవు. అందువలన హిరణ్యక శిపుడు తన చెల్లితో ఇలా చెబుతాడు. 'అమ్మా! హోళికా! నీవు నీ మేనల్లుడిని ఒడిలో కూర్చుండబెట్టుకుని చితిమీద కూర్చో! నీవు శాలువా కప్పుకో. నీకు మంటలు అంటవు. ప్రహ్లాదుడు కాలి బూడిదవుతాడు అని చెబుతాడు. ఆమె అన్న చెప్పి నట్లుగా చితి పేర్పించి ప్రహ్లాదుని తన ఒడిలో కూర్చుండ బెట్టుకుని, తానుమాత్రం శాలువాను కప్పుకుని చితికి నిప్పు పెట్టుమంటుంది. అత్తఒడిలో కూర్చున్న ప్రహ్లాదుడు ఏమీ భయపడకుండా నారాయణ నామ స్మరణ చేస్తూ ఉంటాడు. విష్ణువు తన మాయచే హోళికశరీరంపై ఉన్న శాలువను ప్రహ్లాదుని శరీరంమీదకి వచ్చినట్లు చేస్తాడు. అప్పుడు హోలిక బూడిద అవుతుంది. ప్రహ్లాదుడు క్షేమంగా బయటకు వస్తాడు. ఆ రోజు హోళిక దహించ బడిన కారణం



చేత ఈనాటికీ చాలా ప్రదేశాలలో ఊరి మధ్యలో పాత కర్రలతో మంటలు పెట్టి 'హోళికాదహనం' అని జరుపుకుంటారు. రాక్షసుల పరాక్రమం ఆ రోజుతో అంతమయినది అని సంతోషంలో జరుపుకొనే పండుగ. ఈ పండుగకు మరొకగాథ కూడా ప్రచారంలో ఉంది. తారకాసురుడనే రాక్షసుడు బ్రహ్మచే వరం పొంది. మదగర్వంతో దేవతలను బాధించుతూ ఉండేవాడు. ఆ బాధలు తట్టుకొనలేక దేవతలు విష్ణుమూర్తిని ఆశ్రయించగా అప్పుడు విష్ణుమూర్తి ఇలా చెబుతాడు. తారకాసురుడు శివుని కుమారుని చేతిలోనే మరణం పొందేటట్లు వరం పొందాడు. కానీ శివుడేమో విరాగిలా స్మశానాలలో తిరుగుతూ ఉంటాడు. కనుక మీరు ఎలా గైనా హిమవంతుని వద్దకు వెళ్ళి ప్రార్థించి పార్వతిని ఒప్పించి శివకల్యాణం జరిగేటట్లు చూడమని చెబుతాడు. విరాగిగా మారిన శివునిలో కోరికలు కలిగించడానికి అతనివద్దకు మన్మథుని పంపుతారు ఋషులు. శివునిపై మన్మథుడు కామమును ప్రేరేపించే పూలబాణం వేయించుతారు. ఆ బాణ ప్రభావం శివునిలో శారీరక వికారమును కలిగించగా ఆయన కోపంలో మన్మథుని చూశాడు. ఆ సమయానికి మన్మథుడు ఇంకా పూలబాణం చేతిలో పట్టుకునే ఉండటం గమనించి కోపముతో తన మూడవకన్ను తెరుస్తాడు. ఆ సమయంలో ఆ కంటినుండి వచ్చిన మంట లు సూర్యుని కిరణాలలో ఉన్న ఏడురంగులకాంతి మిళిత మైన ఆ మంటలధాటికి మన్మథుడు భస్మమైపోతాడు. అది గమనించిన మన్మథుని భార్య రతీదేవి శివుని ప్రార్థించగా కామదేవుడయిన మన్మథుని తిరిగి బ్రతికించుతాడు. కానీ భౌతికంగా కనిపించడని, భౌతికకామం కంటే నిజమైన ఉద్రేకపూరితమయిన ప్రేమ ఆధ్యాత్మికతను తెలియజేసే మానసిక ప్రతిరూపంగా మాత్రమే కనిపిస్తాడని తెలియజేస్తాడు. ఆ ఏడురంగుల మంటలను గుర్తుచేసుకుంటూ రంగుల పండుగ క్రింద ఈ హోలీని జరుపుకుంటారు. శ్రీకృష్ణునికి సంబంధించిన మరొక విషయంకూడా ఈ హోలీపండుగకు సంబంధించింది. బాలకృష్ణుని ఫాల్గుణ మాసం పౌర్ణమిరోజునే ఊయలలో వేసినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అందువలన పశ్చిమబెంగాల్లో ఈ పండుగరోజున శ్రీకృష్ణుని ప్రతిమను ఊయలలోని వేసి 'డోలోత్సవం' జరుపుతారు. అందుకనే డోలికోత్సవం అనే పేరు కూడా వచ్చింది. ఈ హోలీ పండుగరోజున యవ్వనంలో ఉన్న కృష్ణుడు గోపికలతో రాధతో కలసి రంగురంగుల పువ్వులతో ఆటలాడాడట. కృష్ణుడు పెరిగిన మధుర, బృందావనంలో 16 రోజుల పాటు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. "రంగ పంచమి" రోజున శ్రీకృష్ణునికి రాధపై ఉన్న ప్రేమను కొనియాడతారు. తల్లి యశోదతో శ్రీకృష్ణుడు తన శరీరం నీలివర్ణం, రాధశరీర ఎరుపువర్ణం గురించి ఫిర్యాదుచేశాడట. అందు కని కృష్ణునితల్లి యశోద రాధ ముఖానికి రంగులు పూసిందట. అందువలన అందరూ హోలీపండుగకు రంగులు పులుముకుంటారట. పూరీ జగన్నాథ్ జగన్నాథుడి ఆలయంలో కృష్ణుడు, రాధ విగ్రహాలు ఉంచి ప్రత్యేక పూజలు జరిపి అత్యంత ఆనందంతో వేడుకలు జరుపుకుంటారు. మహారాష్ట్రలో హోళిక దిష్టిబొమ్మను దహనంచేసి, వీధులలో ఉదయం నుండి సాయంత్రం వరకు మంటలు వేస్తారు. కాశ్మీరులో సైనికులు రంగు రంగుల నీళ్ళను చల్లుకుంటూ పండుగ జరుపుకుంటారు. ఒకసారి కృష్ణుడు రాధ గ్రామానికి వచ్చి అక్కడ గోపిక లను ఆటపట్టించాడట. అది తప్పుగా భావించిన ఆ గ్రామ ప్రజలు కర్రలతో కృష్ణయ్యను వెంబడించారట. అప్పటినుండి హోలీ పండుగను 'లార్మోర్' అనే పేరుతో జరుపుకుంటారు. "విలాసానాం సృష్టికర్త్రీ హోలికా పూర్ణిమా సదా" కాళిదాసమహాకవి ఈ హోలీ పండుగను వర్ణించుచూ సూర్యకాంతిలోని ఏడురంగుల కలయిక హోలీ అన్నాడట. రంగులు అంటే రాగరంజిత భావానలు అని అర్థం. అవి పాలు, వెన్న, నెయ్యి, తేనె రంగు రంగుల పూలు ఇలా స్వభావసిద్ధంగా ఉండాలి. అవి ఆరోగ్యకరమైనవిగా ఉండాలి. ఆనందమంటే ఆరోగ్యాన్ని ఇవ్వాలి. అది శారీరకంగా, మానసికంగా ఆధ్యాత్మికంగా కూడా. అంతేగానీ రసాయనాల రంగుల హోలీ కాదు. రసాయనాల రంగులు ఆనందమును ఇవ్వకపోగా అనారోగ్యాన్ని ఇస్తాయి. అల్లసాని పెద్దన పౌర్ణమి వెన్నెల గురించి ఇలా అన్నాడు– "వెలగడిమి నాడి వెన్నెల అలవడునే గాదిబోయెన అమవస నిశితిన్" అంటే పౌర్ణమనాటి వెన్నెలను విడిచి బెట్టకుండా గాదెలలో దాచి ఉంచి అమావాస్యవరకు కూడా వెలుగునుంచుకోవాలని... అలాగే జీవితంలో పండుగలద్వారా మనం పొందే ఆనందం, మానసిక ఆనందంగా మలచుకోవాలని పెద్దనగారి ఉద్దేశ్యం. ఎలా అంటే ఈ పండుగను గాయన్, హసన్, జల్పన్ అన్నట్లుగా అంటే పాటలతో, నవ్వులతో, కాముని దహనంతో ఆనందంగా గడపాలని అర్థం.

---

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాలు పూర్తి చేయాలి::



(మొదటి పేజీ తరువాయి... )

ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ పకడ్బందీగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను ప్రత్యేకమైన రిజిస్టర్ లో తీసుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో ,రెవెన్యూ డివిజన్ అధికారులు మధు సుధను, జివాకర్ రెడ్డి ,శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఊరికి కీడు సోకిందని గ్రామం విడిచిన గ్రామ ప్రజలు

- **వరస మరణాలతో భయపడుతున్న విలాసాగర్ గ్రామస్తులు.**






**జమ్మికుంట, మార్చి 13 ప్రజాజ్యోతి :** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో గత కొద్దిరోజులుగా వింత ఘటన చోటు చేసుకుంటుంది. విలాసాగర్ గ్రామంలో రెండు నెలల వ్యవధిలో 13 మంది వివిధ కారణాలతో మృతి చెందారు. విచిత్రం ఏమిటంటే ఒక వ్యక్తి మృతి చెంది వారి దశ దినకర్మ పూర్తి అయ్యే లోపు మరొకరు మృతి చెందడం అలా 11 మంది మృతి చెందే వరకు మరణాలు ఆగడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇలా వరుస మరణాల తో ఆందోళన చెందుతున్న గ్రామస్తులు పలువురు వేదపండితుల సూచన మేరకు గ్రామ పెద్దల సలహాతో గురువారం ఉదయం 5 గంటలకు ఇల్లు వాకిలి విడిచి కీడు వంటల కొరకు మానేరు పరివాహక ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామస్తులందరూ కీడు వంటలను వండుకొని ఆరగించిన తదుపరి సాయంత్రం చీకటి పడ్డ తర్వాత ఇంటికి చేరుకోవాలని పేద పండితులు సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న కీడును గురించి గ్రామ ప్రజలు అందరూచర్చించుకుని గురువారం ఉదయం తెల్లవారు జామునే గ్రామంలోని ప్రతి ఒక్కరు చిన్న పెద్ద ముసలి భేదం లేకుండా అందరూ కలిసి మానేరు పరివాహక ప్రాంతంలో కీడు వంటలకు వెళ్లారు.. రెండు నెలల్లో 13 మంది మృతిచెందగా వారి లో కొంతమంది అనారోగ్యంతో మృతిచెందగా మరికొంత మంది ఆత్మహత్య చేసుకోవడం మరి కొంతమంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది.గతంలో ఇదే మాదిరిగా గ్రామానికి కీడు సోకితే కీడు వంటలకు వచ్చామని అప్పుడు బాగానే జరిగిందని వారు వివరించారు. శాస్త్ర సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో ఇలాంటి నమ్మకాలను గ్రామస్తులు నమ్మడం యాదృచ్ఛిక మా.. లేక దైవ లీల అనే సందేహం పలువురిని కలిగిస్తుంది. ఏది ఏమైనా గ్రామస్తులు అందరూ తెల్లవారుజామునే ఊరు విడిచి వెళ్లడంతో విలాసాగర్ గ్రామం అంతా తాళాలు వేసి ఉండి నిర్మానుషంగా మారింది. ఏది ఏమైనా గ్రామస్తుల నమ్మకంతో ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా ఉండాలని పలువురు కోరుకుంటున్నారు.

# స్త్రీ నిధి బకాయిలను పూర్తిగా చెల్లించాలి

- **అదనపు కలెక్టర్ అరుణ శ్రీ**
- **స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలి.**





**పెద్దపల్లి ప్రతినిధి , (ప్రజాజ్యోతి), మార్చి 13:** స్త్రీ నిధి బకాయిలను పూర్తిగా చెల్లించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ లో మెప్మాలోని స్త్రీ నిధి లో అత్యల్ప ప్రగతి కలిగిన రిసోర్స్ పర్సన్ ను సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ మాట్లాడుతూ స్త్రీ నిధి బకాయిలను వెంటనే కట్టించాలని, ఈ ఆర్థిక సంవత్సరం ప్రతి పట్టణ / స్లం సమాఖ్యలు 100% రికవరీ సాధించాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా బోలోపేతం కావాలని తెలిపారు. అత్యధిక వడ్డీ రేట్లు ఉండే మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్దకు మహిళలు వెళ్లకుండా మహిళా సంఘాల ద్వారా స్త్రీ నిధి లోనే రుణాలు అందించాలని తెలిపారు. మహిళా సమాఖ్యలలో దీర్ఘకాలంగా బకాయిలు ఉన్న కమ్యూనిటీ ఆర్గనైజర్స్, రిసోర్స్ పర్సన్ లను సమీక్ష చేసి బకాయిలు పూర్తిగా కట్టించాలని అన్నారు. సమీక్షకు హాజరు కాని రిసోర్స్ పర్సెన్స్ పై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రికవరీలలో అవకతవకలు జరిగితే క్రిమినల్ కేసులు పెట్టాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్క సమాఖ్య, రిసోర్స్ పర్సన్ వారి బకాయిలను పూర్తిగా చెల్లించి స్త్రీ నిధి రుణాలు వినియోగించుకునేలా రుణ ప్రణాళికను తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క రిసోర్స్ పర్సన్ బాకీ పడిన సభ్యురాలని సందర్శించి నోటీసులు ఇచ్చి రోజువారిగా రికవరీ వివరాలను రిపోర్ట్ చేయాలని అన్నారు. మహిళా శక్తిలో భాగంగా లోన్ బీమా ప్రమాద బీమాలలో నమోదైన క్లెయిమ్ లను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. మహిళా శక్తిలో భాగంగా కొత్త యూనిట్ లను నెలకొల్పాలని అన్నారు. సంఘాలలో లేని సభ్యులను సంఘాలలో చేర్చి కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మహిళా సంఘాలలో చేరే వారి వయసు సడలించిందని ప్రస్తుతం 15 నుంచి 65 సంవత్సరాల వరకు మహిళ సంఘాలు చేరవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్లు, రిసోర్స్ పర్సన్స్ , తదితరులు పాల్గొన్నారు .

# బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి

- **విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత.**



**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), మార్చి13:** విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని పెద్దపల్లి మండలం రాగినేడు జిల్లా పరిషత్ సెకండరి పాఠశాల పూర్వ విద్యార్థి గుమ్మడి కొమురయ్య అన్నారు. గతేడాది మరణించిన కొమురయ్య సతీమణి గుమ్మడి హారిక జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోటుబుక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పది పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి జీవితంలో జయాపజయాలు సర్వసాధారణమని, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. అత్యధిక మార్కులు, ర్యాంకులకోసం విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి పెట్టరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చాట్ల ఆగయ్య, ఉపాధ్యాయులు కొమురెల్లి, జగదీశ్వరరెడ్డి, రజిత, సౌభాగ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వేల్పూరి పద్మ, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు నరసింహచారి, వేల్పూరి ఆంజనేయులు, యాదగిరి సంతోష్, దబ్బేట శరత్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువరైతు మృతి



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 13:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన నక్కల రవి 35 సంవత్సరాలు అనే యువరైతు గురువారం రోజున ఉదయం ఊరు చివరలో గల తన పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లి మోటార్ టాటర్కు ఉన్న స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాకు గుర్రై అక్కడికక్కడే మృతి చెందాడుమృతుడికి భార్య నక్కల అనూష కుమారుడు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు ఈయన మృతితో కుటుంబం పెద్దదిక్కుని కోల్పోయింది బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

# రాగంపేట్ లో వితరణ కార్యక్రమాలు



**చొప్పదండి, మార్చి 13(ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలకు చీరలు పంపిణి, గ్రామానికి 8బెంచీలు వితరణ చేశారు. రాగంపేటకు చెందిన పేరం కిషన్ కుమారుడు సురేందర్ నిరుపేద కుటుంబానికి చెందిన మహిళలకు చీరలు పంపిణి తో పాటు కూర్చోవడానికి 2బెంఛీలు గురువారం అందజేశారు. కాగా రాగంపేట వాస్తవ్యులు రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కాస నర్సయ్య 6 బెంచీలు గ్రామానికి వితరణ చేశారు. గ్రామానికి ఇలాంటి సేవ కార్యక్రమాలు చేస్తున్నందుకు పేరం కిషన్, కాస నర్సయ్య లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లొ మాజీ గ్రామ సర్పంచ్ మామిడి లతరాజేశం,సింగిల్ విండో డైరెక్టర్ గజ్జల శంకర్, పేరం సత్యనారాయణ, పేరం అశోక్, పేరం శివయ్య, దీకొండ ప్రభాకర్, దీకొండ రమేష్, ఎద్దు వెంకటేశం పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 13:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ గురువారం రోజున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తూరు మొండయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బసవత్తుల జ్ఞానేంద్ర చారి వైస్ చైర్మన్ గా ఎంపిక పట్ల ఘన సన్మానం



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజాజ్యోతి మార్చి 13:** మండలంలోని మల్యాల గ్రామం లో గల శ్రీ విశ్వేశ్వర స్వామి శివాలయం దేవాలయాల వైస్ చైర్మన్ గా బసవత్తుల జ్ఞానేంద్ర చారి ఎంపిక పట్ల గ్రామస్తులు గురువారం రోజున శాలువాలతో ఘ నంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మేడం మహేష్ గడబోయిన రాజేందర్ పిన్నింటి విష్ణువర్ధన్ రెడ్డి ఓలమల్ల తరుణ్ అంబాల కుమార్ అరేల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీపీ



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 13 :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ గురువారం రోజున పరామర్శించి సంతాపం వెలబుచ్చారుఆయన వెంట మాజీ ఎంపీటీసీ కొత్తూరు మొండయ్య తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ డి పెద్దపల్లి జిల్లా అధ్యక్షునికి సత్కారం



**గోదావరిఖని , మార్చి 13 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు ను బాల్య మిత్రులు ఘనంగా సత్కరించారు.మంగళవారం గోదావరిఖని లో జరిగిన కార్యక్రమంలో ఆనంద్ బాబు చిన్ననాటి క్లాస్ మెట్స్ శాలువా కప్పి సత్కరించారు.పూలమాల వేసి జ్ఞాపిక బహుకరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. చాలా ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడం ఎంతో సంతోషం గా ఉందన్నారు.డాక్టర్ గా కొనసాగుతూ రాజకీయాలలో ఉంటూ పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమితులు కావడం అభినందనీయమన్నారు.ఆనంద్ బాబు రానున్న రోజుల్లో మరింత పెద్ద పదవులలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆనంద్ బాబు మిత్రులు బొడ్డు పెల్లి రాజమౌళి,వుల్లి మొగిలి,అంజన్ కుమార్,జల్ల కుమారస్వామీ,పాషా,తిరుపతి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హిందుత్వకాంక్షను రగిలించేలా శ్రీరామనవమి శోభాయాత్ర

- పోస్టర్లను ఆవిష్కరించిన హిందూవాహిని.



**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి13:** ప్రతీ హిందువులో సనాతనధర్మకాంక్షను రగిలించేలా శ్రీరామనవమి మహాశోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూవాహిని జిల్లా సహ సంయోజక్ ఉయ్యంకార్ సాయికుమార్ అన్నారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించబోయే శోభాయాత్ర పోస్టర్లను ప్రముఖ వ్యాపారవేత్త బాలకిషన్ జాకోటియా చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. సాయికుమార్ మాట్లా డుతూ, సనాతన ధర్మ రక్షణ కొరకు ఎంతోమంది హిందూయువకులు ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్నారని అలాంటి నిస్వార్ధ కార్యకర్తలకు ప్రతీ ఒక్కరు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణాలో హిందువుల పవిత్ర ఆలయాలపై అన్యమతస్తులు జరుపుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి దుశ్చర్యలు నిలుస్తాయని ప్రభుత్వానికి సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రకు హిందువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సాయికుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మంచాల వరప్రసాద్, శ్రీనివాస్, బండారు సురేష్, హిందువాహిని నాయకులు పూసల శ్యాంసుందర్, వెంకటసాయి, సాయిచరణ్, క్రాంతి, అరుణ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## గీర్వాణి పాఠశాలలో ముందస్తుగా హోళి పండుగ వేడుకలు

**చొప్పదండి, మార్చి 13 ( ప్రజా జ్యోతి ):** గీర్వాణి విద్యాలయంలో గురువారం నాడు ఘనంగా హోళి పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొండ గంగయ్య మాట్లాడుతూ మన హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో హోళి పండుగ ఒకటని, ఈ పండగను ప్రేమ, ఐక్యత సంతోషానికి సంకేతంగా భావిస్తారని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా పరస్పరం అందరూ ఒకటనే భావంతో రంగులు జల్లుకుంటూ ఆనందంగా జరుపుకుంటారని చెప్పారు. హోళి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులందరూ రంగులు జల్లు కుంటూ ఆనందంగా ఆటపాటలతో ఆడి పాడారు. ప్రధానోపాధ్యాయురాలు అందుర్తి లత, పాఠశాల కోఆర్డినేటర్ లుకోడూరి నాగరాజు, సిరిపురం శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుమలత, సిరి చందన, కీర్తి ప్రి య, అక్షయ, సంజన, అనూష, వనజ, యోగ మాస్టర్ సత్తినేని శ్రీనివాస్ , విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ హోళి కేళి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 13, (ప్రజా జ్యోతి ):** హోళి రంగుల పండుగా పిలువడం జరుగుతుందని, జీవితాల్లో వెలుగులు నింపే పండగని తద్వారా సమాజంలో ఆనందం, వాత్సల్యం వెల్లివిరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో వేడుకగా నిర్వహించినటువంటి అల్ఫోర్స్ హోళి కేలీ కి ముఖ్య అతిధిగా హాజరై ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ ప్రతిఒక్కరు సుఖసంతోషాలతో వారి జీవనాన్ని కొనసాగించాలని మరియు ఆర్థికంగా సుభిక్షంగా ఉండాలని తెలుపుతూ ప్రతిఒక్కరు జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా కొనసాగించాలని ఆయన కోరారు.నేడు చాలా మంది పలు కారణాల వలన మానవ బంధాలకు దూరమవుతున్నారని మరియు ప్రేమా వాత్సల్యం తరిగిపోతుందని విచారం వ్యక్తం చేస్తూ ప్రతిఒక్కరు సోదర భావంతో మెదిలి ఇతరులకు మేలు చేయడమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలని ఆయన చెప్పారు.రంగుల రంగుల జీవితాలలో ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో వర్దిలాలనే ఉద్దేశంతో హోళ్లి పండుగకు ముందు రోజు కామదహన కార్యక్రమాన్ని వీధుల లోని ప్రధాన కూడళ్ళలో కామదహన కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహిస్తారని చెప్పారు. ప్రతిఒక్కరు పండుగల ప్రాశ్చస్త్యాన్ని విధిగా గుర్తుంచుకోవాలని, వాటి విశిష్ఠతను ఇతరులకు తెలియజేయాలని చెప్పారు.సమాజంలో వివిధ రకాల వ్యక్తులు వివిధ రకాల గుణాలతో ఉంటారని, చెడు గుణాలను వదులుకునేటట్లుగా ప్రోత్సాహకాలను అందిచాలని చెప్పారు. ఈ పండుగను అత్యంత ఆనందోత్సవాల మధ్య ప్రపంచం వ్యాప్తంగా ఘనంగా విభిన్నంగా నిర్వహించుకుంటారని మరియు సహజసిద్ధమైన రంగులతో హోళీని నిర్వహించుకోవాలని అభిప్రాయపడుతూ మత సామరస్యానికి విలువైన ప్రతీకగా ఉంటుందని చెపారు. హోళీ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను అట్టహాసంగా ఆకాశమే హద్దుగా అన్నట్టు నిర్వహించడం జరిగినదని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి హోళి హమారా రంగోలి, హోళి హోతే హే హమారే విశ్వమే, చూడమ్మ రంగుల పండుగ హోళి పండుగ, హోళి కావాలి మనకు సిరుల పండుగ నృత్యాలు చాలా ఆకర్షింపచేసాయి.ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాములన్న పోరాట స్ఫూర్తితో పోరాటాలు

- ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు క్రిష్ణ.



**గోదావరిఖని , మార్చి 13 (ప్రజా జ్యోతి) :** సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా,ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు దివంగత యు.రాములు స్పూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు క్రిష్ణ పిలుపునిచ్చారు.గోదావరిఖని గాంధీ నగర్ ఐ ఎఫ్ టీ యు కార్యాలయంలో గురువారం రాములన్న 21వ వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రాములన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ రాములన్న సిపిఐ (ఎం ఎల్ ) న్యూడెమోక్రసీ ఐఎఫ్టీయూ నాయకత్వంలో వివిధ హోదాలో పనిచేశారని,సంఘటిత,అసంఘటిత,పేద ప్రజల,కార్మిక వర్గ ప్రయోజనాలు వారి హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించాడన్నారు.ఈ క్రమంలో రాములన్న హత్యకు గురయ్యాడన్నారు.కార్మిక వర్గ పోరాటాలు ఉన్నంతకాలం రాములన్న పోరాట స్ఫూర్తి కొనసాగుతూనే ఉంటుందన్నారు.20 సంవత్సరాల క్రితం మున్సిపల్ టీ జంక్షన్ సమీపంలో నిర్మించిన రాములన్న స్థూపాన్ని అకారణంగా మున్సిపల్ అధికారులు తొలగించడం బాధాకరమన్నారు.తొలగించిన స్థూపాన్ని మున్సిపల్ అధికారులు వెంటనే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో స్థూప నిర్మాణం జరిగే వరకు మున్సిపల్ ఆఫీస్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు.ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రజా,కార్మిక,రైతు వ్యతిరేక విధానాలు ముందుకు వస్తున్న క్రమంలో రాములన్న వంటి నాయకులు లేకపోవడం సంస్థకు,కార్మిక వర్గానికి తీరని లోటన్నారు.సిపిఐ(ఎం-ఎల్ ) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఏ.వెంకన్న,చిలుక శంకర్,ఈ రామకృష్ణ,ఐ.రాజేశం, మేరుగు చంద్రయ్య, ఇ.రాజేందర్,కొల్లూరి మల్లేశం,బి.బుచ్చయ్య,భూషణం,డి.బుచ్చమ్మ, ఎం కొమరయ్య,డి.రాజమౌళి,ఎడ్ల రవికుమార్, గుండు రాజయ్య,ఎస్ ప్రసాద్, ఐ సాంబయ్య, దుర్గం పోచయ్య,నారాయణ,కాంపెల్లి మల్లేశం,అవినాష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- సుద్దాలలో పొలం బాట పట్టిన విద్యుత్ అధికారులు.




**సుల్తానాబాద్ మార్చి 13 (ప్రజా జ్యోతి ):** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని కనుకుల ఏ ఈ దామోదర్ రావు అన్నారు. గురువారం సిఎండి ఆదేశాల మేరకు మండలంలోని సుద్దాల గ్రామంలో కరెంట్ అధికారులు పొలం బాట పట్టారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ అంతరాయం కలగకుండా పలు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ట్రాన్స్ఫార్మర్లు, ఎర్త్ తదితర సమస్యలను రైతుల పొలాల వద్దకు వెళ్లి సందర్శించినట్లు దామోదర్ రావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన కనుకుల సెక్షన్ కార్యాలయ పరిధిలోని తనకు గాని, విద్యుత్ అధికారులకు సమాచారం ఇస్తే వెంటనే పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు. సూచించారు. ఈ కార్యక్రమంలో, లైన్ ఇన్స్పెక్టర్ రాజేశం, ఎల్ ఐ రమేష్, లైన్మెన్ ఆరెపల్లి ఐలయ్య, కుమార్, ఏ ఎల్ ఎం పృధ్విరాజ్ , నరేష్, రాధాకృష్ణ, రంజిత్, అజార్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం



**చొప్పదండి ,మార్చి 13 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం రుక్మాపూర్ ఆదర్శ పాఠశాలలో గురువారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ సుధాకర్ పాఠశాల వార్షిక నివేదికను వివరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలని అన్నారు. అందుకు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు నృత్యాలు, పాటలు, ఉపన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులు, మండల నోడల్ అధికారి మోహన్, చొప్పదండి జెడ్పి హెచ్ఎస్ (బాలురు ) ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రుక్మాపూర్ జెడ్పి హెచ్ఎస్ హెచ్ఎం శ్రీధర్, ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లోటస్ పాండ్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- వచ్చే విద్యా సంవత్సరం నుండి లీడ్ ప్రొపెల్ తో కలయిక
- మెరుగైన విద్యను అందించడమే లోటస్ పాండ్ పాఠశాల లక్ష్యం
- కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు .





**జమ్మికుంట,మార్చి13( ప్రజాజ్యోతి ) :** జమ్మికుంట పట్టణంలోని లోటస్ పాండ్ పాఠశాలలో యుకేజి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించుటకు లీడ్ ప్రొపెల్ ఎడ్యుకేషన్ సంస్థతో కలిసి విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.. దీనిలో భాగంగా స్మార్ట్ క్లాస్, టీచర్ ట్యాబ్ తోపాటు పియర్సన్ పుస్తకాలు పుస్తకాలు ప్రవేశ పెడుతున్నామని, విద్యార్థులకు తరగతి గదిలో టీచర్ విద్యాబోధన తో పాటు ఆన్ లైన్ స్క్రీన్ ద్వారా సులభంగా విద్యార్థులకు అర్థం కావడానికి వీడియో ద్వారా చూపించడం జరుగుతుందని అన్నారు.. ఇప్పటికి వరకు పాఠశాల నిర్వహణకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.. భవిష్యత్ లో పాఠశాల నిర్వహణకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.. ఆనంతరం యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల ప్రధానోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అలరించాయి.. హార్ట్ ఫుల్ నెస్ యోగ సంస్థ వారిచే పాఠశాలలో 16వారాలు విద్యార్థులకు యోగ శిక్షణ ఇచ్చి సెర్టిఫికెట్ ని విద్యార్థులకు అందించారు. విద్యార్థులకు గిజుబాయ్ బుక్స్ సంస్థ వారిచే ప్లే వే పద్దతిలో విద్యను అందించి టీచర్లకు, విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేశారు.. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం ను కలిసిన రామగుండం ఎమ్మెల్యే



**గోదావరిఖని , మార్చి 13 (ప్రజా జ్యోతి) :** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.హైదరాబాదులో జరుగుతున్న సిఎల్పీ సమావేశాల సందర్భంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో అవసరమైన నిధుల విషయం సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులు,నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికల పై వివరించినట్లు తెలిపారు.ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

## ఉరి వేసుకుని ఇరువురి ఆత్మహత్య





**చొప్పదండి, మార్చి 13(ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలంలో గురువారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరు సంఘటనల్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన పూసల రోహిత్ (17) కరీంనగర్ లోని ఒక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షల్లో ఫెయిలవుతానేమోనని భయంతో గురువారం ఉదయం చీరతో ఉరి వేసుకున్నట్లు ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. కాగా చొప్పదండి పట్టణం కుమ్మరి వాడకు చెందిన తాళ్లపల్లి అమృతవ్వ (70) తన కుమారుల భూమి గొడవల కారణంగా మనస్థాపానికి గురైందని పేర్కొన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది చీరతో సీలింగ్ ఫ్యాన్ కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని రకాల విద్యాబోధన

- మండల విద్యాధికారి సిరి మల్ల మహేష్.



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 13:** ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని రకాలుగా విద్యాబోధన చేయనున్నట్లు మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్ అన్నారు కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పెద్దంపేట్ కిష్టంపేట్ ఇదులాపూర్ గ్రామాల్లో గల పాఠశాలల విద్యార్థులకు ట్వినింగ్ ఆప్ స్కూల్స్ కార్యక్రమాన్ని గురువారం రోజున ఘనంగా నిర్వహించారు విద్యార్థులకు సైన్స్ కు సంబంధించిన అంశాలను ల్యాబ్ లో చూపించారు ఐఎఫ్పి ప్యానెల్ బోర్డుల ద్వారా సులభంగా విద్య నేర్చుకోవచ్చు విద్యార్థులకు చూపించారు అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత వివిధ పాఠశాలల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కవితను కలిసిన కోరుకంటి



**గోదావరిఖని , మార్చి 13 (ప్రజా జ్యోతి) :** రామగుండం మాజీ ఎమ్మెల్యే బి ఆర్ ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు.గురువారం అసెంబ్లీ టిఆర్ఎస్ఎల్పి కార్యాలయం లో కవితను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పుష్పగుచ్ఛం అందజేశారు.

## హోలీ వేడుకలు మండల ప్రజలు శాంతి భద్రతలతో జరుపుకోవాలి

- మండల ప్రజలకు తోటి అధికారులకు హోలీ శుభాకాంక్షలు ఎస్సై నరేష్.



**ముత్తారం మార్చి,13 (ప్రజా జ్యోతి):** హోలీ వేడుకలను పురస్కరించుకొని ఎస్సై నరేష్ మండల ప్రజలకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. మండల ప్రజలు, యువత సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని అన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హోలీ పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రజలు సంతోషం గా హోలీ వేడుకలను జరుపుకోవాలి అని తెలియజేశారు. సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని సూచించారు మధ్యం మత్తులో వాహనాలు న డపటం మధ్యం మత్తులో రోడ్లపై వచ్చే వారిని ఇబ్బంది పెట్టడం అసభ్యంగా ప్రవర్తించడం వాహనాల పై రంగులు చల్లడం చట్ట విరుద్ధంమని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తప్పని తెలిపారు.

## ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహాయ సహకారాలు అందిస్తాం

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్.

**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి మార్చి 13:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన నక్కల రవి అనే యువరైతు విద్యుత్ షాక్ తో గురువారంమృతి చెందాడుమృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ పరామర్శించి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు దృష్టికి తీసుకెళ్లి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ అరెల్లి సుజాత రమేష్ ఉన్నారు.

## శార్వాణి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా ముందస్తు హోలీ సంబరాలు



**ముత్తారం మార్చి,13 (ప్రజా జ్యోతి):** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శార్వాణి విద్యానికేతన్ పాఠశాల లో ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబురాలు జరుపుకున్నారు శార్వాణి విద్యానికేతన్ పాఠశాల కరస్పాడెంట్ దాయకపు శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీ సంబురాలు ఎంత ఆనందంగా సంతోషంగా జరుపుకుంటున్నారో విద్యార్థుల జీవితాలు సంతోష కరమైన రం గులమయం కావాలని వారి జీవితాలు ముందు కు సాగాలని కోరుకుంటూ విద్యార్థుల కు ఉపాధ్యాయులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలి

- రాత్రి 10 కి బిర్యాని సెంటర్స్ హోటల్స్ మూయాలి
- అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు
- పట్టణ సిఐ వరగంటి రవి .

**జమ్మికుంట, మార్చి13( ప్రజాజ్యోతి ):** పట్టణంలో ప్రజలందరూ హోలీ పండుగ సౌభ్రాతృత్వంతో, సామరస్యంగా ,శాంతి యుతంగా జరుపుకోవాలని జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి సూచించారు.. ఏవైనా ఘర్షణ వాతావరణం నెలకొంటే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని అన్నారు. హోలీ సందర్భంగా బిర్యానీ సెంటర్స్, హోటల్స్ రాత్రి 10 గంటల వరకు మూసివేయాలని తెలిపారు.. హోలీ రోజున వాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ వెళ్లకూడదని, మద్యం సేవించి వాహనాలు నాడుపకూడదని, రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండాలని, వాహనాలపై వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించ కుండా ఉండాలని ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్ర శాంత వాతావరణంలో వారి వారి ఇంటి వద్ద హోలీ సంబరాలు జరుపుకోవాలని అన్నారు.. సహజమైన కలర్స్ తో హోలీ అడుకోవాలని, కెమికల్స్ తో కూడిన కలర్స్ వాడడం ద్వారా కళ్ళల్లో వెళ్లి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని సూచించారు..



## ఏనాడూ రైతుల గోస పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే

- మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ .



**చొప్పదండి, మార్చి 13 (ప్రజా జ్యోతి):** ఏనాడూ రైతుల గోస పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను విమర్శించడం హాస్యాస్పదమని మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ విమర్శించారు. బిఆర్ఎస్ ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజు రైతుల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు పదవి పోగానే రైతులు గుర్తుకు వచ్చారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హాయంలో నారాయణపూర్ జలాశయం నుండి సంవత్సరానికి కేవలం రెండుసార్లు మాత్రమే నీళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పుడు కూడా మేడిపల్లి సత్యం రైతుల కష్టాలు తెలుసుకొని ధర్నాలు చేస్తేనే నీళ్లు విడుదల చేశారని అన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సు కి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, నారాయణపూర్ జలాశయం నుండి రైతులకు ఎప్పుడు అవసరం ఉన్న ఎప్పటికప్పుడు నీళ్లు విడుదల చేసిన ఘనత ఎమ్మెల్యే సత్యం దని పేర్కొన్నారు. రైతులను మోసం చేసే పార్టీ తమది కాదని రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వమని చెప్పారు. నియోజకవర్గ రైతుల కోసం ఎమ్మెల్యే రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని ప్రశంసించారు. అధికారంలో ఉన్నప్పుడు బి ఆర్ ఎస్ నాయకులు అబద్దాలతో పూటగడుపుకున్నారని ప్రస్తుతం అధికారం కోల్పోయాక కూడా అదే ధోరణి లో ఉన్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే మేడిపల్లి సత్యం ,మేడిపల్లి సత్యం అంటే అభివృద్ధి అని కొనియాడారు.

## జమ్మికుంట భూకబ్జాలపై తహశీల్దార్ కి పిర్యాదు

- నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్.




**జమ్మికుంట, మార్చి13 (ప్రజాజ్యోతి):** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ భూమి కబ్జాదారుల చే తుల్లో ఉందని ప్రభుత్వ అధికారులు వెంటనే దానిని స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని జమ్మికుంట తహశీల్దార్ రమేష్‌బాబు కి ఫిర్యాదు చేసినట్లు నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ తెలిపారు.. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ కేంద్రంలోని 647 సర్వే నెంబర్ లో రెండు ఎకరాల స్థలాన్ని సుమారు 50 సంవత్సరాల క్రితం జమ్మికుంట మాజీ సర్పంచ్ కృష్ణంరాజు తో పాటు గ్రామ పంచాయతీ పాలకమండలి శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యవస్థాపకులు కాంతారావు కి లీజ్ మీద స్థలం ఇచ్చారని 2002 లో కాంతారావు మరణించగా ఆ స్కూల్ మూసి వేశారని అన్నారు.. అప్పటికి నిరుపయోగంగా మారినటువంటి ఆ స్థలాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా గత ప్రభుత్వంలోని కొంత మంది అధికారులు,అధికార యంత్రాంగం ఆ స్థలాన్ని కబ్జా చేసి ఆ భూమిని ప్లాట్లు చేసి అమాయక ప్రజలకు అమ్మడం జరిగిందని అన్నారు. వాళ్లు నిర్మాణం చేపట్టే క్రమంలో విద్యార్థి సంఘాలుగా మున్సిపాలిటీకి కంప్లైంట్ చేసినప్పుడు ఇంటి నిర్మాణం పర్మిషన్ ఇవ్వకుండా నిలిపివేశారు.. ఆ స్థలాన్ని తిరిగి మళ్ళీ విక్రయాలు చేసి ప్రయత్నం కొందరు చేస్తున్నారని అన్నారు.. 647 సర్వే నెంబర్లు గల భూమిని గత 20 సంవత్సరాల క్రితం ఎంత భూమి ఉండే ప్రస్తుతం ఎంత భూమి ఉన్నది,అలాగే 647 సర్వే నెంబర్లో కొంతమంది అక్రమ కబ్జాదారులు ధరణి పోర్టల్ లో వారి పేరు చూపెడుతుంది అని వారి తండ్రి పేరు ,జెండర్, ఈ కేవైసీ అప్డేట్ లేదని చూపెట్టడం కోస మెరుపు.. అక్రమ భూకబ్జా చేసిన కబ్జాదారుల పైన శాఖ పరమైనటువంటి కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా భూ కబ్జాదారులని పిలిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెంకటేష్ తెలిపారు.

## ఆధునిక పద్ధతుల్లో కూరగాయలను సాగుతో అధిక లాభాలు

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్ సీ జీడిమెట్ల హార్టికల్చర్ ఆఫీసర్ జలంధర్.





**చొప్పదండి, మార్చి 13 (ప్రజా జ్యోతి) :** నాబార్డ్ వారి సౌజన్యంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలోని మల్లన్నపల్లిలో కూరగాయలు సాగు చేసే 25 మంది మహిళా రైతులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ జీడిమెట్లలో ఉన్న ఆర్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్ కు క్షేత్ర ప్రదర్శనకు గురువారం వెళ్లారు.ఈ సందర్భంగా సెంటర్ అడ్మిన్,హార్టికల్చర్ ఆఫీసర్ జలంధర్ మాట్లాడుతూ కూరగాయల సాగులో మల్టీ క్రాప్ మెథడ్స్, పందిరి కూరగాయలు వీటితోపాటు ఆకుకూరలు వేసవికాలంలో మల్చిం గ్, డ్రిప్పు పింక్ కలర్ ఇరిగేషన్ ద్వారా రైతులు పంటలు పండించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ, ఎస్సీలకు,బీసీలకు 90శాతం సబ్సిడీ తో ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్పులను అందించడం జరుగుతుందన్నారు.ఈ డ్రిప్పు ద్వారా నీటి ఆదాతో పాటు కూరగాయల్లో మంచి నాణ్యమైన దిగుబడి ఫెటిగేషన్ చేయడం ద్వారా కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చని పిలుపునిచ్చారు.హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు టమాట సాగులో స్టేకింగ్,హైడ్రోపోనిక్ పద్ధతులను హైటెక్ నర్సరీలను వాటి ద్వారా రైతులకు వంద శాతం సబ్సిడీ మీద మొక్కలను అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో పెండ్లి సంపత్ కుమార్,జన వికాస స్టాప్ కోఆర్డినేటర్ రాజు పెసరి,సోమేశ్వర్ తోట మనిషా, సుష్మ వీరితో పాటు 25మంది మహిళ రైతులతోపాటు ఫ్యాక్స్ డైరెక్టర్ పద్మ తదితరులు హాజరయ్యారు.

## సమాజ రక్షణకు ప్రతి ఒక్కరు సైనికుడై పనిచేయాలి

- సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు సమత ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేష్ .



**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి ), మార్చి 13:** సమాజ రక్షణ కొరకు ప్రతి ఒక్కరూ సమతా సైనికులై పనిచేయాలని సమతా సైనిక దళ రాష్ట్ర నాయకులు, సమత ఫౌండేషన్ నిర్వాహకులు మార్షల్ దుర్గం ప్రమీల – నగేష్ లు అన్నారు. ఈ మేరకు గురువారం సమతా సైనిక్ దళ్ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం మూడో డివిజన్ అన్నపూర్ణ కాలనీలోనీ వారి నివాసంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 13 మార్చ్ 1927 సమతా సైనిక దళ్ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. అది అణగారిన ప్రజల రక్షణ కొరకు ప్రత్యేక శిక్షణ తీసుకొని, ఆపద సమయంలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉండే వారే సమతా సైనిక్ దళ్ సభ్యులని తెలిపారు, సమతా సైనికులు సమాజంలోని ప్రజల స్థితిగతులను అధ్యయనం చేసి అందరిలో చైతన్యం కల్పించాలని తెలిపారు. దేశంలో మహిళలపై జరుగుతున్నదాడుల, అత్యాచారాల నుండి విముక్తి కల్గించడానికి పనిచేయడానికి బహుజన యువకులు తమకు తాము ఒక సైన్యాన్ని సిద్ద చేసుకోవాలని పిలుపునిచ్చారు , అప్పుడే దుండగుల దాడుల నుండి సమాజాన్ని రక్షించగలుగుతామని తెలిపారు. యువత ముందుకు వచ్చి అందరికి భారత రాజ్యాంగం హక్కులు రిజర్వేషన్లపై విద్యపై చైతన్యం కల్గించాలని కోరారు. అప్పుడే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాన్ని నెరవేర్చిన వాళ్లమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ ఎన్టీపీసీ కమిటీ అధ్యక్షులు ముడిమడుగుల సురేష్, ప్రధార కార్యదర్శి చీమల ఆనంద్, సభ్యులు జిమ్మిడి అశోక్, జిమ్మిడి శాంతి కుమార్, మేరు కుల సంఘం జిల్లా కన్వీనర్ గూడూరు లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై అనవసరపు నిందలు వేస్తే ఊరుకోం

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల.




**గోదావరిఖని , మార్చి 13 (ప్రజా జ్యోతి) :** రామగుండం నియోజకవర్గాన్ని చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,టిఆర్ఎస్ నాయకులు కౌశికహరి అనవసరపు నిందలు వేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ హెచ్చరించారు.గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు ఈ ప్రాంతానికి ఏమి చేయకుండా పనిచేస్తున్న ఎమ్మెల్యే పై లేనిపోని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర కాలంలో రూ.వందల కోట్ల నిధులను ఈ ప్రాంతానికి తీసుకు వచ్చారని గుర్తు చేశారు.సింగరేణి,ఆర్ ఎఫ్ ఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ఒప్పించి సిఎస్ఆర్ నిధులను ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో సిఎస్ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తుంటే ఏనాడు నోరు మెదపని చందర్ ఇప్పుడు మాట్లాడడంలో అర్థం లేదని కొట్టిపారేశారు.ప్రతిపక్షంగా తగిన సలహాలు సూచనలు అందిస్తే తాము స్వీకరిస్తామని,అనవసరపు ఆరోపణలు చేస్తే తిప్పి కొడతామని స్పష్టం చేశారు.ఈ ప్రాంత అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని రాజేష్ మరోసారి సవాల్ విసిరారు.పోచమ్మ గుడిలో ప్రమాణాలు చేసినంత మాత్రాన వాస్తవాలు బయటికి రావని,తమపై ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల పై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రాంత ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు విలేకరుల ఈ సమావేశంలో నాయకులు కాల్వ లింగ స్వామి,దీటి బాలరాజు,పెద్దల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్,ముస్తఫా,గట్ల రమేష్,నాయని ఓదెలు,సతీష్,శంకర్ పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- ట్రాఫిక్ సీఐ కరీముల్లఖాన్.

**కరీంనగర్ క్రైం,మార్చి 13,ప్రజాజ్యోతి:** తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వ వద్దని ట్రాఫిక్ సీఐ కరీముల్లఖాన్ సూచించారు.సిఐ మాట్లాడుతూ కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో అధిక శబ్దంతో అసౌకర్యం కలిగించే 2 వాహనాలు,మైనర్ డ్రైవింగ్ 15 వాహనాలు పట్టుబడ్డాయని తెలిపారు,పట్టుబడ్డ మైనర్లు,వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశామని పేర్కొన్నారు,మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చ రించారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సిఐ పర్శ రమేష్,ట్రాఫిక్ ఎస్ఐ ఉపేంద్ర చారి, ఆర్ఎస్ఐ గణేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవు

- హోలీ పండుగను ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో సురక్షితంగా జరుపుకోవాలి
- రోడ్లపై గుమి గుడు తూ ట్రాఫిక్ కు అంతరా యం కలిగించిన, పరిచయంలేని వ్యక్తులపై బలవంతం గా రం గులు చల్లిన, గొడవ లు సృష్టించిన కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.




**(ప్రజాజ్యోతి), ఎల్లారెడ్డిపేట, మార్చ్, 13:**రాజన్న సిరిసిల్ల జిల్లాలో హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా జరుపుకోవాలని రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం, పరిచయం లేని వ్యక్తులపై రంగులు జల్లడం,బలవంతంగా రంగులు చల్లి న, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూహో లీ వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని. యువకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసిన , చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వాహన యజమానులపై కేసులు న మోదు చేయడం జరుగుతుందని హె చ్చరించారు. హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అదిక నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు.పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేసిన, గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుం దని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని జిల్లా ఎస్పి మ హేష్ బీ. గితే విజ్ఞప్తి చేసారు.


## పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేసిన కలెక్టర్



**పెద్దపల్లి ప్రతినిధి , ప్రజా జ్యోతి, మార్చి 13:** కరీంనగర్ జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి ఇంజనీరింగ్ 2వ సంవత్సరం చదువుతున్న రామగుండం ప్రాంతానికి చెందిన విద్యార్థినికు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో ల్యాప్ టాప్ పంపిణీ చేశారు.రామగుండం తబితా ఆశ్రమానికి చెందిన పేద విద్యార్థిని ఎస్. శ్రీజ తన ఇంజనీరింగ్ చదువుకు ఉపయోగపడే విధంగా ల్యాప్ టాప్ అవసరం ఉందని అన్నారు. 8వ తరగతి లోనే తల్లి కోల్పోయిన ఎస్. శ్రీజ తబితా ఆశ్రమంలో ఉంటూ చదువుకొని, పదవ తరగతి లో 10 జిపిఎ, ఇంటర్ లో 983/1000 మార్కులతో ఉత్తీర్ణత సాధించానని, జ్యోతిష్ మతి ఇంజనీరిం గ్ కాలేజీలో సీటు లభించిందని, 2వ సంవత్సరం చదువు కోసం ల్యాప్ టాప్ అవసరం ఉందని కొరుతూ ఇటీవల ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా స్పం దించిన జిల్లా కలెక్టర్ 40 వేల రూపాయల నూతన ల్యాప్ టాప్ ను సంబంధిత విద్యార్థినికి నేడు పంపిణీ చేశారు. రానున్న రోజులలో విద్యార్థిని చాలా చక్క గా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## మెదడు వ్యాధికి యశోద ఆసుపత్రి వైద్యుల అరుదైన చికిత్స

**కరీంనగర్ బ్యూరో, మార్చి 13, (ప్రజాజ్యోతి):** మెదడు కు సంబంధించిన వ్యాధి తో ప్రాణాపాయ స్థితి లో ఉన్న 41ఏండ్ల రమేష్ అనే వ్యక్తి కి సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్స అందించి బ్రతికించారు. కరీంనగర్ లోని యశోద ఆసుపత్రి వద్ద గురువారం సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డాక్టర్ మోహన కృష్ణ తో పాటు చికిత్స పొందిన పెద్దపెల్లి కి చెందిన రమేష్, అతనిభార్య, సోదరుడు పాల్గొని మాట్లాడారు.న్యూరో ఫిజీషియాన్ డాక్టర్ మోహన కృష్ణ రమేష్ కు వచ్చిన వ్యాధి కి సంబంధించిన చికిత్స వివరాలు తెలిపారు.పెషేంట్ కు జ్వరం, తల తిరగడం సెంసోరియం లో మార్పులు, సృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఒక్క రోజు వున్నాయని, సింసోరియం మారడంతో అతన్ని వెంటిలేటర్ పై ఉంచడం జరిగిందన్నారు. తాత్కాలికంగా తీవ్రమైన మేనింగో ఏంటిపాలిటిస్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఎమ్మారై స్కాన్ లో లెస్టో మెంగినిటీస్ మెదడు కుడి వైపు న తీవ్రమైన ఇన్ఫర్క్యట్స్ (గడ్డకట్టడం )ఉన్నట్లు తెలిందాన్నారు. స్పేనల్ ట్యాప్ లో పెరిగిన ప్రోటీన్ న్యూట్రో ఫీలిక్ ప్లియొసైటోసిస్ (1050,85%ఎన్)తో సంబంధం ఉన్న తక్కువ గ్లూకోస్ కనిపించిందన్నారు సి ఎస్ ఎఫ్ బ్లడ్ కల్చర్ లో సరెప్టో కొకస్ ఆగాలాకిటీయో కన్పించాయాన్నారు. ఎగ్ లో ఎన్ సి ఎస్ ఇ నాన్ కన్వాల్సివ్ స్టేటస్ కనబడిందాన్నారు.రోగికి యాంటీ బయోటిక్స్ యాంటీ ఎపిలేప్టిక్స్, ఇతర సహాయక చర్యలలో చికిత్స అందించడం జరిగిందన్నారు అతనికి దీంతో మంచి మెరుగుదల కనిపించిందన్నారు. మెకానికల్ వెంటిలేటర్ తొలగించిన తర్వాత డిశ్చార్జ్ చేశామన్నారు. ఈ వ్యాధి కి సంబంధించిన క్రిమి ప్రతి మనిషి శరీరంలో ఉంటుందని తెలిపారు క్రిమి ఎఫెక్ట్ జరిగితే త్వరగా 24 గంటల లోపు చికిత్స చేయించుకుంటే రికవరీ ఎక్కువ శాతం లో ఉంటుందన్నారు తీవ్రమైన పయోజనిక్ మెనింగో ఎస్పెపాలిటీస్ ప్రాంతకం అయినప్పటికీ అన్ని వయసుల వారి లోనూ సెంపోరియం లో మార్పు చెందిన వ్యాధికి చికిత్స చెయ్యవచ్చునన్నారు ఇది పక్షవాతం మూర్ఛ లేదా నాన్ కన్వెల్సివ్ (పిట్స్ ) తో సంక్లిష్టంగా ఉంటుందన్నారు. స్క్రెప్టో కోకస్ అగల క్టీ యో సాధారణంగా గర్భిణీ స్త్రీలు , నవజాత శిశువు లు, తక్కువ రోగ నిరోధక శక్తి ఉన్న వ్యక్తులను ప్రభావితం చేస్తుందన్నారు. యువకుల కు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు తీవ్రమైన ఇన్ఫెక్షన్లు సమస్యల దృష్ట్యా ఆసుపత్రి లో ఎక్కువ కాలం చికిత్స పొందవలసి రావచ్చు అన్నారు. సరైన రోగ నిర్ధారణ ప్రారంభ దశలోనే చికిత్స పొందడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం ఈ వ్యాధి నుండి చి కిత్సతో బయటపడిన రమేష్ భార్య మాట్లాడుతూ. తన భర్త పరిస్థితి చూసి చాలా భయమేసిందని తెలిపారు. తనకు వచ్చిన వ్యాధితో చాలా రోజులు తనను గుర్తించలేదని, మనుషులను గుర్తించడమే కాకుండా మాట కూడా సరిగా రాలేకపోయిందని కుటుంబ సభ్యులమంతా భయాందోళన చెందినామని తెలిపారు. యశోద ఆసుపత్రి వైద్యులు తన భర్తకు చికిత్స అందించి కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్య బృందంతో పాటు కరీంనగర్ యశోద ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశ అనంతరం యశోద ఆసుపత్రి జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కన్సల్టెన్సీ ఇచ్చి వైద్యం అందించనున్నట్లు తెలిపారు జర్నలిస్టులు వారి గుర్తింపు కార్డులను చూయిస్తే చాలు అని తెలిపారు.



## మార్చి 15 నుంచి ఏ ఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన

- విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ
- 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాల పెంపు లక్ష్యం
- ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన విద్యాశాఖ కార్యదర్శి.






**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), మార్చి -13 :**మార్చి 15 నుంచి జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏ.ఐ ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ అన్నారు.గురువారం హైదరాబాద్ నుంచి వి ద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ , విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డి తో కలి సి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వి ద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ మాట్లాడుతూ, ఫిబ్రవరి నెలలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించామని, అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి జిల్లాలో కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ముందస్తుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏ.ఐ వినియోగిస్తూ సులభతరంగా విద్యా బోధన చేయాలని అన్నారు.ఏ.ఐ. కోర్సు ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్ ఫోన్స్ ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. జిల్లాలో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలలో ఏ ఏ కోర్సు ద్వారా విద్య బోధన జరుగుతుందని, ఇక్కడ వచ్చే ఫలితాలను అంచనా వేస్తూ భవిష్యత్తులో దీన్ని మరింత విస్తరించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పి.ఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు పెంచడం పై హెడ్ మాస్టర్లు శ్రద్ధ పెట్టాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- విద్యా సంవత్సరం ముగిసే లోపు ప్రతి పాఠశాలలో 80 శాతం విద్యా ప్రమాణాలు సాధించాలి
- మంథని మండల పాఠశాలల హెడ్మాస్టర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.






**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి 13:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడం పై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత హెడ్మాస్టర్లతో ఎఫ్.ఎల్.ఎన్. పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందని అన్నారు . పాఠశాలల్లో గుణాత్మక విద్య మెరుగుపరచడానికి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణ గురించి కీలకమైన సూచనలు కలెక్టర్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ లలో రాసి, చదివే సామర్థ్యాలను పెంచాలని, గణితం లో కనీస సామర్థ్యం ఉండేలా దృష్టి సారించాలని అన్నారు. మండలంలో కొన్ని పాఠశాలలు చక్కగా పనిచేస్తున్నాయని అభినందించారు. విద్యా సంవత్సరం ముగిసే లోగా ప్రతి పాఠశాలలో 60 నుండి 80% వరకు ప్రతి విద్యార్థికి చదవడం రాయడంతో పాటు గణితంలో కనీస సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత డ్రైవింగ్ శిక్షణ కొరకు ఆసక్తి గల వారు మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలి

- **జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి.**

**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి ), మార్చి -13:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట నుండి ఉచిత డ్రైవింగ్ కోర్సులో శిక్షణ కొరకు ఆసక్తి గల బిసి యువతీ యువకులు దరఖాస్తులను మార్చి 31 లోపు సమర్పించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ద్వారా నిరుద్యోగ బిసి యువతీ యువకులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట ద్వారా హెవీ మోటార్ వాహనం, తేలిక పాటి మోటార్ వాహనం డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు .38 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తామని, అభ్యర్థులకు ఉచిత భోజనం వసతి సౌకర్యం ఉంటుందని అన్నారు. హెవీ మోటార్ వెహికల్ కొరకు 20నుంచి 45 సంవత్సరాల వరకు, తేలికపాటి మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కొరకు 18 నుంచి 40 సంవత్సరాల వరకు ఎనిమిదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం ఆదా ధ్రువీకరణ పత్రం పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు లెర్నింగ్ లైసెన్స్ తో మార్చి 15 నుంచి మార్చి 31 సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా బిసి అభివృద్ధి కార్యాలయం లో పని వేళల సమయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 96.82 శాతం విద్యార్థులు హాజరు

- **ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన.**



**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి ), మార్చి 13 :** గురువారం జిల్లాలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం సంవత్సరం పరీక్షకు 96.82 శాతం విద్యార్థులు హాజరు కావడం జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా ఆమె మాటడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1బి / జువాలజీ / హిస్టరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఈ పరీక్షకు (4570) మంది హాజరు కావాల్సి ఉండగా, (4425)మంది హాజరు కాగా,(144) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఈ రోజు 96.82 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, నేటి పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## పెద్దమ్మ తల్లి ఆలయానికి హుండిని బహుకరించిన గూళ్ల ప్రసాద్

- **ధన్యవాదాలు తెలియజేసిన ముదిరాజ్ కుల సంఘం సభ్యులు.**



**చిగురుమామిడి మార్చి 13(ప్రజా జ్యోతి ) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి దాదాపు 15వేల రూపాయల విలువ చేసే హుండీని అదే గ్రామానికి చెందిన గూళ్ల ప్రసాద్ మౌనిక కుటుంబ సభ్యులు గురువారం బహుకరించినట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గుళ్ళ కనకయ్య,ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు గుళ్ల బాలయ్యలు తెలిపారు.ఆలయానికి హుండీ ఇవ్వాలని కోరగానే పెద్ద మనసు చేసుకొని వెంటనే స్పందించిన గూళ్ళ ప్రసాద్ మౌనిక కుటుంబ సభ్యులకు ముదిరాజులు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులపై ఉండాలని అమ్మవారిని కోరారు.ఈనెల 15న ఆలయంలో శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం పెద్దలు కోరారు.ఈ కార్యక్రమంలో గుళ్ల రవి, గుళ్ళ బాలయ్య,హనుమడ్ల సత్యనారాయణ,పిల్లి వేణు, కడారి రాయమల్లు కుల సంఘం సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

# 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- **జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్.**





**పెద్దపల్లిప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మార్చి -13:** పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తెలిపారు. గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ పక్క సమాచారంతో పెద్దపల్లి లోని బండారి కుంట, సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామాల్లో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో నిల్వ ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని , పెద్దపల్లి లోని బండారి కుంట వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తనిఖీల్లో పట్టుకోవడం జరిగిందని అన్నారు. 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటో ను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని ఎం.ఎల్. ఎస్ పాయింట్ కు తరలించామని, ఆటోను పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందని పౌరసరఫరాల అధికారి తెలిపారు. వాహనం యజమాని, డ్రైవర్, అక్కడ పనిచేస్తున్న ఇతర లేబర్ పై తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వులు 2016 ప్రకారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ తనిఖీలలో డిప్యూటీ తహసిల్దారులు రవీందర్, మహేష్ కుమార్, ఎన్ఫోర్స్మెంట్ సంబంధిత అధికారులు, తదితరులు జిల్లా పౌర సరఫరాల అధికారి వెంట ఉన్నారు.

## ఘనంగా యుపిఎస్ దుర్గాయ పల్లె పాఠశాల విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు





**పెద్దపల్లి ప్రతినిధి,( ప్రజాజ్యోతి ), మార్చి 13:** పెద్దపల్లి జిల్లా రామగుండం మూడో డివిజన్ ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీలోని దుర్గయ్య పల్లె ప్రాథమికోన్నత పాఠశాల లోనీ 8వ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ .కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఆనందోత్సాహాలతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగింది పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రేణుక మాట్లాడుతూ విద్య వలన వివేకం వస్తుందని జ్ఞానం పెంపొందుతుంది కాబట్టి విద్యార్థులంతా చక్కగా చదువుకొని గొప్పవారు కావాలని అన్నారు విద్యార్థులంతా తమ అనుభవాలను పంచుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

- **యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు .**




**జమ్మికుంట, మార్చి13( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మండలంలోని కొరపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కెల్ విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... చదువుతోనే బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని 10 వ తరగతి తోనే భవిష్యత్ కు తొలిమెట్టని అన్నారు. అదే విధంగా పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ.. పదవ పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా రానున్న పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తాళ్లపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బోయిని కుమార్, ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగారపు మహేష్, పోల్సని సంతోష్ రావు, పొన్నం చంద్ర మౌళి, దొగ్గల భాస్కర్, కళ్లేపల్లి జంపయ్య, గిరావేనా శ్రీనివాస్, కొండూ భిక్షపతి, పోల్సని సంపత్ రావు, యూత్ కాంగ్రెస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాతకాల రమేష్, రాచపల్లి జగన్ ములుపొజు కమలాకర్, అమృత శివ, పురేళ్ళ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫూట్ బాల్ పోటీలకు జ్యోతి విద్యార్థులు

**జగిత్యాల టౌన్, మార్చి 13, ప్రజాజ్యోతి :** జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీ కి చెందిన 8 వ తరగతి విద్యార్థులు వి. మైత్రి (బాలికల విభాగంలో) , అర్ .శ్రీహర్ష ( బాలుర విభాగంలో ) అక్టోబర్ 10 , 2024 పెద్దపెల్లి లో నిర్వహించిన జోనల్ స్థాయి ఎస్ జి ఎఫ్ యూ-14 ఫూట్ బాల్ పోటీలలో పాల్గొని ఈ నెల 14 నుండి 16 వరకు డాక్టర్ బాల కిష్టయ్య క్రీడా ప్రాంగణం, వనపర్తి లో జరిగే రాష్ట్ర స్థాయి ఫూట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారు. పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు విద్యార్థులను అభినందించి , రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ బియ్యాల హరి చరణ్ రావు , శ్రీధర్ రావు , మౌనికా రావు ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# కన్నుల పండుగగా కామ దహనం





**జగిత్యాల టౌన్, మార్చి13, ప్రజా జ్యోతి:** జగిత్యాల పట్టణంలో టవర్ సర్కిల్, శ్రీనగర్ కాలనీ, గణేష్ నగర్, పూరనిపేట ప్రాంతాల్లో కామదహన వేడుకలను ఆనందోస్తావల మధ్యన ఘనంగా జరుపుకున్నారు ఈ కాము డు విశిష్టత ను స్మరించుకుంటు

హిందూ ధర్మచక్రందక్షయజ్ఞ సమయంలో అగ్నికి ఆహుతి అయిన సతీ దేవి, ఆ తరువాత హిమవంతుని కూతురైన పార్వతిగా జన్మిస్తుంది. తపోదీక్షలో వున్న పరమశివుడికి పార్వతి సపర్యలు చేస్తూ ఉంటుంది. లోక కల్యాణం కోసం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని జరిపించవలసిన అవసరం గురించి దేవతలు మన్మథుడిని ఆశ్రయిస్తారు. వారి కోరిక మేరకు సదాశివుడిని కామ వికారాలకు గురిచేయడం కోసం మన్మథుడు పూల బాణాలు వేస్తాడు. విషయాన్ని గ్రహించిన శంకరుడు, తన తపోదీక్షకు భంగం కలిగించిన మన్మథుడిని మూడవ నేత్రం తెరచి భస్మం చేస్తాడు. అది చూసిన దేవతల అభ్యర్థన మేరకు .. లోక కల్యాణం కొరకు తన భర్త ఆ విధంగా చేశాడంటూ 'రతీదేవి'కన్నీటి పర్యంతమవుతుంది. దాంతో పార్వతీ దేవి పరమేశ్వరుడిని ఒప్పించి, మన్మథుడు అశరీరంగా .. అదృశ్య రూపంతో వుండునట్టుగా 'రతీదేవి'కి మాంగల్య భాగ్యాన్ని ప్రసాదిస్తుంది. మన్మథుడిని కాముడు అని అంటారు .. ఆయన సజీవుడైన రోజు ఫాల్గుణ పౌర్ణమి .. అందువల్లనే ఈ రోజును 'కాముని పున్నమి' అని అంటారు. స్త్రీలు .. పురుషులు ఈ రోజున సరదాగా .. సంతోషంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేస్తారు. ఇక ఈ రోజున 'హోళిక' అనే రాక్షసి సంహరించబడటం వలన, 'హోలీ' పేరుతో సంబరం చేసుకోవడం జరుగుతుందనే మరో కథనం వినిపిస్తూ ఉంటుంది.కాముడు తన విజయాన్ని చూసి మురిసిపోతూ కనిపించాడు. ఆయన "నువ్వు నా సాధనకి భంగం కలిగించి, నాలో కోరిక కలిగేలాగా చేస్తావా?" అని ఆయన మూడో నేత్రం తెరచి కామదేవుణ్ణి భస్మం చేసాడు.అదే కామదహనం విశేషం అని గుర్తుకు చేసుకున్నారుఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏవిటంటే, ఏ కోరికైనా సరే, ఏ కామమైనా సరే మనకు అంతర్ముఖంలో కలిగేదే. ఆయన మూడో నేత్రం తెరవడం అన్నది అంతర్ముఖంలోకి తెరిచి చూడడం అని అర్థం. అంతే కానీ ఆయన చెట్టు చాటున ఉన్న ఓ మనిషిని భస్మం చేశారు అని అర్థం కాదు. ఆయన అంతర్ముఖ నేత్రం తెరిచి ఆయనలో ఉన్న కామాన్ని దహించారని అర్థం. మనకు భౌతికమైన విషయాలను చూడటానికి ఈ రెండు నేత్రాలు సరిపోతాయి. మనం అభౌతికమైనది చూడాలి అన్నప్పుడు మనకు మరో నేత్రం అవసరం. ఇది అంతర్ముఖ నేత్రం. ఇదే మూడో కన్ను.మూడో కన్ను అంటే మన నుదురు మధ్యలో నుంచి తెరుచుకుని వచ్చే కన్ను అని అర్థం కాదు. "మూడో నేత్రం అంటే అంతర్ముఖ నేత్రం". ఇది మనం అంతర్ముఖంగా చూడడానికి సహకరిస్తుంది. మనకి ఉన్న బాహ్యమైన రెండు కళ్ళు, బాహ్య విషయాలను చూసేందుకు ఉపయోగపడతాయి. మరి నుదిటి గురించి ఎందుకు మాట్లాడారు అంటే "ఆజ్ఞా చక్రం అక్కడ ఉంటుంది కాబట్టి. ఆజ్ఞా చక్రం మనకి అంతర్ముఖ దృష్టిని కలిగిస్తుంది". ఇదంతా కూడా అంతర్ముఖ దృష్టి కలగడం గురించినదే అని గుర్తు చేసుకుంటూ వేడుకలను ముగించారు.

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల టౌన్, మార్చి13, ప్రజాజ్యోతి:** జగిత్యాల పట్టణం లో మంచినీళ్ళ బావి దగ్గర 29,30 వార్డులకు సంబంధించి 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను,న్యూ హై స్కూల్ లో 10 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలన చేసి అభివృద్ధి పనుల వివరాలను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పర్యవేక్షించారుఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్,క్యదాసు నాగయ్య,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పంబాల రాం కుమార్,మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్,మాజీ కౌన్సిలర్ లు తోట మల్లీ కార్జున్, బోడ్ల జగదీష్ ,పిట్ట ధర్మరాజు,కూతురు రాజేష్,నాయకులు డిష్ జగన్,రామ్మోహన్ రావు, ప్రభాత్,శరత్ రావు,శ్రీరామ్ భిక్షపతి,రంగు మహేష్,ప్రవీణ్ రావు,డాన్ శ్రీను,జంగాతిరుపతి,గంగాధర్,కుశ్రు,అనీఫ్,ప్రసాద్,దర్మెందర్,శ్రీనివాస్,రజాక్,పట్టణ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానకు స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల రూరల్, మార్చి13, ప్రజాజ్యోతి:** జగిత్యాల జిల్లాలోని రూరల్ మండలం తక్కలపల్లి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా 20లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖాన నిర్మాణపనులకు స్థల పరిశీలన చేసి, పల్లె దావఖాన నిర్మాణానికి భూమి దానం చేసిన హనుమాన్ రెడ్డి ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శాలువా తో సత్కరించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముస్కు ఎల్లా రెడ్డి,దశరథ రెడ్డి,బాల ముకుందం,రవీందర్ రెడ్డి,జైపాల్ రెడ్డి,విక్రమ్,రమణ రెడ్డి, కృష్ణ,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,ఉప సర్పంచ్ లు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం-ప్రాణదానం-కోరుట్ల సేవాదళ్




**కోరుట్ల మార్చి 13ప్రజాజ్యోతి ప్రతినిధి:** కోరుట్ల పట్టణంలోని న్యూలైఫ్ హస్పిటల్ లో చికిత్స పొందుతున్న అఫ్రీన్ వయస్సు 31కి అత్యవసరంగా బి పాజిటివ్ మూడు యూనిట్ల రక్తం అవసరం అవ్వగా కోరుట్ల సేవాదల్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజుకు విషయం తెలిపారు.వెంటనే స్పందించిన నాగరాజు చిలివేరి మనోజ్,తోట మధు లకు విషయం తెలుపగా వారు వెంటనే స్పందించి రక్త నిధి కి వెళ్లి తమ రక్తాన్ని దానం చేశారు.ఈ సందర్భంగా రక్త దానం చేసిన వారిని హాస్పిటల్ వైద్యులు, రోగి బంధువులు సిబ్బంది పలువురు అభినందించారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా ఇమ్మడి శ్రీనివాస్



**ధర్మపురి (మార్చి 13)ప్రజా జ్యోతి :** జగిత్యాల జిల్లా ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు గా న్యాయవాది ఇమ్మడి శ్రీనివాస్ ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ 209 ద్వారా ఉత్తర్వులు జారీచేసింది.ఇ సందర్భంగా నూతన ఏ జి పి నియామకం పట్లా బార్ అసోసియషన్ అధ్యక్షులు రౌత్ రాజేష్, ఉప అధ్యక్షులు రామడుగు రాజేష్, ట్రెజరీ జజాల రమేశ్,స్పోర్ట్స్ సెక్రటరీ బత్తిని ఇంద్రకరణ్, సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, అలుక వినోద్,గడ్డం లింగారెడ్డి, న్యాయవాదులు సుంకే రాజు, కలమడుగు కీర్తి లు హర్షం వ్యక్తం చేశారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**మల్లాపూర్ మార్చ్ 13, ప్రజాజ్యోతి:** అక్రమ ఇసుక రవాణా పై పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు గురువారం దాడులు జరిపారు. మండలంలోని పాత ధామ్ రాజ్ పల్లి గ్రామ శివారులోని గోదావరి నది నుండి అక్రమంగా ఇస్తున్న తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ శాఖ, పోలీస్ వారు సంయుక్తంగా దాడులు జరుపగా నాలుగు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలిస్ స్టేషన్ కి తరలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏకాగ్రతతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

- **ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం .**

**కోరుట్ల మార్చి 13ప్రజాజ్యోతి ప్రతినిధి:** విద్యార్థినీ,విద్యార్థులు ఏకాగ్రతతో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం అన్నారు. కోరుట్ల మండలం జోగన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు జోగన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా సైదు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా చదివి పరీక్షలు రాయాలని, మండల స్థాయిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం మాట్లాడుతూ జీవితంలో గొప్పగా ఎదిగిన వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం జోగన్ పల్లి పదవ తరగతి విద్యార్థులకు మంచి ర్యాంకు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఇదివరకు పని చేసిన పాఠశాలల్లో చదివే విద్యార్థులను తమ కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా కేర్ తీసుకొని ప్రతి ఒక్క విద్యార్థిలో లోపాలు గమనించి అందరిని ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాజంను పలువురు ప్రశంసించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో అద్భుత నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు ఆలయ కమిటీ సభ్యులు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడుమల భూమారెడ్డి, పోతవేణి రాజశేఖర్, ముత్యపు రాజశేఖర్, కనికారపు రాజేశం, పాఠశాల ఉపాధ్యాయులు కామిని లక్ష్మణ్, మహమ్మద్, పసియుద్దీన్, తునికి వెంకట సుదీర్, సిహెచ్ యుగధర్ రాజ్, బక్కశెట్టి తిరుపతి, అక్క జ్యోతి లక్షి , పాలకుర్తి రామ్ నరేష్ పాల్గొన్నారు.



## హోలీ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలి ఎస్పీ అశోక్ కుమార్

- ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దు, మహిళల పట్ల మర్యాదగా ఉండాలి.



**జగిత్యాల బ్యూరో, మార్చి 13, ప్రజా జ్యోతి:** జగిత్యాల జిల్లా లోని ప్రజలు హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కావున జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని,చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోలీ రోజున పోలీస్ సిబ్బంది డ్రంక్ అండ్ టెస్ట్ లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు., హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అదిక నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలుతీసుకోవడం తో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పి విజ్ఞప్తి చేసారు.

## ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు పై పటిష్ట కార్యాచరణ

- పట్టణ ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించండి
- కోరుట్ల ,మెట్ పెల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ బిసత్య ప్రసాద్.



**కోరుట్ల మార్చి 13 ప్రజాజ్యోతి ప్రతినిధి:** కోరుట్ల ,మెట్ పల్లి పట్టణంలో మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.గురువారం రోజున కోరుట్ల, మెట్ పెల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పనుల వసూలు, ఎల్ఆర్ఎస్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.కోరుట్ల పట్టణంలో అత్యధికంగా ఇంటి పన్ను బకాయిలు ఉన్న షాపింగ్ మాల్ లను సందర్శించి, రెండు రోజులలో బకాయిలు కట్టకుంటే సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఇప్పటి వరకు కోరుట్ల పట్టణంలో 80 శాతం ఇంటి పన్ను వసూలు అయింది. ఈనెల 31 వరకు ఉన్న గడువులో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం గడువు లోపల అందరూ ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలి, లేదంటే వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటాం అని తెలిపారు. ఈనెల 31 వరకు 25 శాతం రాయితీ ఉపయోగించుకొని అందరూ ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలి ఎవరైతే ఫీ చెల్లించి రెగ్యులర్ చేసుకుంటారో వారికి వెంటనే సర్టిఫికెట్స్ జారీ చేయడం జరుగుతుంది అన్నారు. పట్టణంలోని వార్డు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి ప్రతి ఒక్క దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తప్పనిసరిగా మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కోరుట్ల పట్టణంలో 46 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఆమోదించడం జరిగిందని, మిగతా వారిని కూడా ఫాలో అప్ చేస్తూ మార్చి 31 లోగా ఫీజు చెల్లించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అత్యధిక బకాయిలు ఉన్న వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, ఇంకా చెల్లించని వారి ఆస్తులను పురపాలక సంఘ చట్టం – 2019 ప్రకారం సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టం గా ఆదేశించారు.పట్టణ అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని, అందరూ తమ ఆస్తి పన్నులను మరియు ఇతర మున్సిపల్ పన్నులను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. 100% పన్ను వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు సూచించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని అర్బన్ ప్రైమరీ యూపీహెచ్ఎస్సి హెల్త్ సబ్ సెంటర్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ నిర్మాణ పనులను త్వరిగతన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మెట్ పెల్లి పట్టణ శివారులో నూతనంగా నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్ స్థలం సేకరణ పనులను ఆర్డీవో శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ప్రజలకు అనుగుణంగా ఉండే స్థలం లో నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ వెంట, ఆర్డీవోలు, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్లు, రామకృష్ణ, మోహన్, కోరుట్ల తహసిల్దార్ ఇట్యాల కిషన్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

**కోరుట్ల మార్చి 13 ప్రజాజ్యోతి ప్రతినిధి**

కోరుట్ల పట్టణంలో గల అంగడి బజార్ ప్రధాన కూడలిలో జాగృతి నాయకులు కొండ యుగంధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శ్రీమతి కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా 1000 మంది కార్మికులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జాగృతి నాయకులు కొండ యుగంధర్ మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలిగా మరియు ఎమ్మెల్సీగా మరియు జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా సమాజానికి ఎనలేని సేవ చేస్తున్న కల్వకుంట్ల కవిత ,పేద ప్రజలకు ,ఏ కష్టం వచ్చిన ముందుండి తనవంతు సహాయసహకారాలు అందిస్తున్నారు, శ్రీమతి కల్వకుంట్ల కవితక్క తన సమాజ సేవ మరియు అభివృద్ధి పనులతో కలకాలం నిలిచిపోయే విధంగా చరిత్రలో మరియు ప్రజల హృదయాల్లో నిలిచారు.ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు కొండ యుగంధర్ , మహ్మద్ జావీద్ , నీలగిరి రాజెందర్ రావు , పోతారం రమేష్ ,వి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## కోరుట్ల పోలీస్ ఆధ్వర్యంలో పోలీస్ కళాకారుల బృందంచే చట్టాలపై అవగాహన సదస్సు

**కోరుట్ల మార్చి 13 ప్రజాజ్యోతి ప్రతినిధి**

కోరుట్ల పట్టణం ఏకిన్ పూర్ ఆరో వార్డులో జగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోరుట్ల పోలీసు వారి ఆధ్వర్యంలో పోలీస్ కళాకారుల బృందంచే చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్సై–2 రామచంద్రం గౌడ్ మాట్లాడుతూ టూ వీలర్ వాహనదారులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి ప్రాణాలు కోల్పోతున్నారని అలా చేయడం ద్వారా కుటుంబానికి పెద్దదిక్కుని కోల్పోతున్నారని అలాగే మైనర్లకు టూవీలర్లను ఇస్తే తల్లిదండ్రుల పై కేసులు పెడతామని అలాగే యువత, విద్యార్థులు పెడదారిన పడి గంజాయి తాగకూడదని అలాగే పోలీస్ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్సై రామచంద్ర గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ ఆరో వార్డ్ ఇంచార్జ్ మ్యాదరి లక్ష్మణ్ అలాగే గ్రామ ప్రజలు యూత్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



## సైబర్ క్రైమ్ గురించి మెడికల్ విద్యార్థుల కు అవగాహన సదస్సు



**జగిత్యాల, మార్చి13, ప్రజజ్యోతి** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచనల మేరకు సైబర్ క్రైమ్ డిఎస్పీ రంగారెడ్డి ఆధ్వర్యంలో మెడికో విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాల పై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంనుజిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో మెడికో విద్యార్థులకు సైబర్ నేరాలు, వాటి నియంత్రణ గురించి జగిత్యాల సైబర్ క్రైమ్ ఎస్సై కృష్ణ గౌడ్ మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పించారుఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్మ్ సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

## జాగ్రత్తలతో రంగులహోలీ జరుపుకోండి

- డా: ఎల్లాల శ్రీనివాసరెడ్డి చిన్న పిల్లల వైద్య నిపుణులు.



జగిత్యాల టౌన్, మార్చి 13, ప్రజాజ్యోతి: పట్టణ ప్రజలు రంగు రంగులతో హోలీ జరుపుకొనేందుకు చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు ఉత్సహం చూపుతుంటారు అయితే రంగుల విషయంలో జాగ్రత్తలు పాటించక పోతే ప్రమాదం తప్పదని వైద్యులు పేర్కొంటున్నారు నిజానికి పూర్వతరం వారు సహజ సిద్ధ రంగులైన పసుపు, కుంకుమ, చందనం, బుక్క గులాలు, మోదుగ పూలతో తయారు చేసిన రంగులు తో టమాట గింజలతో తయారు చేసిన పొడిని చేసుకొని నీటిలో కలుపుకొని అడుకునేవారు వీటి వలన చర్మానికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేది అంతేకాకుండా చర్మ వ్యాధుల నుంచి ఈ రంగులు రక్షణ కల్పిస్తాయి అని నమ్మకం కానీ ప్రస్తుతం బజారులలో లభించే రంగుల్లో అనారోగ్య కరమైన కెమికల్స్ వాడుతు ఆరోగ్యానికి హాని చేసుకుంటున్నారు ఇవి వారి వారి చర్మానికి హాని కలిగిస్తు కళ్లకు చెవులకు కూడా హాని చేస్తుంటాయి. అందుకే హోలీ ఆడే ముందు వివిధ జాగ్రత్తలు పాటిస్తూ **ఆరోగ్య రక్షణలు తీసుకోండి..** హోలీ ఆడే ముందు ఈ నియమాలు పాటించండిహోలీ ఆడేముందు శరీరమంతా నూనె రాసుకోని జుట్టుకు నూనె పట్టించుకోవాలి. ఒకవేళ శరీరంపై ఏమైనా గాయాలు ఉంటే, ఆ గాయాలపై బ్యాండెజ్ వేసుకోని ఆడుకోవాలి అందువల్ల రంగులు గాయాన్ని చేరకుండ ఉండి చర్మాన్ని రక్షిస్తూ ఉంటుంది. ఒకవేళ సహజమైన రంగులతోనే హోలీ ఆడినా సరే, ఈ జాగ్రత్త లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఒకవేళ ముఖంపై దద్దుర్లు, తామర వంటివి ఉంటే గనుక, మొదట సంబంధిత ఆయింట్మెంట్లు , ఆ తరువాత నూనెను రాయాలి. ఆడ, మగ ఎవరైనా సరే, మొదట సన్స్క్రీన్ లోషన్‌ను రాసాక, నూనె రాసుకోవాలి. బాలికలు, మహిళలు తమ చేతివేళ్లకు దట్టంగా నెయిల్ పాలిష్‌ను వేసుకోవాలి. అందువల్ల ఆ రంగు గోళ్ల కుదుళ్లకు చేరకుండ వుంటూ ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉంటుంది

**కండ్లు ,చెవులు ,ముక్కు జాగ్రత్తలు తప్పనిసరి...** వివిధ రంగులతో ఆడేవారు రంగులు నేరుగా కండ్లు ముక్కు చెవులకుచేరకుండా ఉండటానికి మొఖానికి కళ్లజోడు ధరిస్తే చాలా మంచిది ఒకవేళ కళ్లద్దాలు పెట్టుకోకపోతే ఆ రంగులు కంటిపై పడకుండా తగు జాగ్రత్తగా హోలీ ఆడుకోవాలి అలాగే చెవులలోకి నీరు రంగులు వెళ్లకుండా దూదిని ఉపయోగించాలి అలాగే ముక్కులోకి దుమ్ము ధూళి చేరకుండా మాస్కులు ధరించి హోలీ నియమాలు పాటిస్తూ ఆదుకోవాలి అలాగే హోలీ అడే అప్పుడు సాధారణ కాటన్ దుస్తులు లేదా పాతవైన ధరించి హోలీ ఆడుకోవాలి. ఆ దుస్తులను తదుపరి రోజుల్లో వాడుకోకుండా ఉంటేనే మంచిది ఎందుకు అనగా కొన్ని కొన్నిరంగుల వల్ల అలెర్జీ వచ్చే అవకాశం వుంటుంది అలాంటి వాటిని గుర్తించి సరైన సమయంలో వెంటనే ఆ రంగును నీటితో శుభ్రం చేసుకోని ఆరోగ్యం గా ఉండాలి. అలెర్జీగా అనిపించిన చోట, నీటితో కడిగాక ఐస్‌తో మర్దన లేదా పెరుగు రాయడం వంటివి చేసుకోవాలి లేదంటే అలోవెరా జెల్ కూడా రాసుకుంటే రాబోయే చర్మ సామస్యలు రక్షించుకునే వారు అవుతారు ఈ అన్ని సూచనలు పాటిస్తూ ఆనందంగా పండుగ జరుపుకోని ఆనందంగా ఉండాలి

# గ్రావిటీ హై స్కూల్ లో హోలీ సంబరాలు..





**జగిత్యాల టౌన్, మార్చి13 ( ప్రజా జ్యోతి )** జగిత్యాల పట్టణంలోని కృష్ణనగర్ లో ని గ్రావిటీ హై స్కూల్ లోని విద్యార్థిని విద్యార్థులచే ముందస్తు హోలీ సంబరాలు వేడుకగా జరుపుకున్నారు ఈ హోలీ కార్యక్రమంలో నర్సరీ నుండి పదవ తరగతి విద్యార్థి విద్యార్థులందరూ ఒకచోట చేరి ఒకరికొకరు రంగులు చల్లుకుంటు ఆనంద ఉత్సాహాలతో ముందస్తు హోలీ పండుగను జరుపుకున్నారు. అలాగే విద్యార్థులు వారి వారి ఉపాధ్యులతో కలిసి కెమికల్స్ లేని సహజ సిద్ధమైన వివిధ రకాల రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో పండగను ఉత్సహంగా జరుపుకున్నారు ఈ హోలీ పండుగ చిన్న పెద్ద, ఆడ మగ,కులమత బేధాలు లేకుండా అన్ని రంగుల లాగే మన జీవితం కూడా వివిధ ఒడిదుడుకులను తట్టుకొని నిలబడటమే హోలీ రంగుల ప్రత్యేకత అని పాఠశాల కరస్పాండెంట్ సంధ్యారాణి అన్నారు రంగులు చల్లుకునే ఆచారం మన పూర్వీకుల నుండి వస్తున్న మన సాంప్రదాయం అని స్కూల్ డైరెక్టర్ డా: లక్ష్మీ నారాయణ అన్నారు ఈ పండగ అందరి జీవితాలు హోలీ పండగలా రంగులు విరాయలి అని అన్నారు అలాగే మన జీవితం కూడా రంగులతో ముడిపడి ఉందని భావించి హోలీ పండుగను అంగ రంగ వైభవంగా నిర్వహించుకున్నారు ఈ రంగుల హోలీ కేళి కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యుని ఉపాధ్యులు,పేరెంట్స్ చిన్నారులు పాల్గొని సంతోషాల మధ్యన హోలీ ఉత్సవాలు జరుపుకున్నారు.

## ఈ నెల 15 నుంచి ఏ.ఐ . ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన

- విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా
- 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాల పెంపు లక్ష్యం
- ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన విద్యాశాఖ కార్యదర్శి
- హాజరైన కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**జగిత్యాల బ్యూరో మార్చి 13 ప్రజా జ్యోతి:** ఈ నెల 15 వ తేదీ నుంచి జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏ.ఐ ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు.గురువారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డి తో కలిసి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడు తూ, ఫిబ్రవరి నెలలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించామని, అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి జిల్లాలో కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ముందస్తుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏ.ఐ వినియోగిస్తూ సులభతరంగా విద్యా బోధన చేయాలని అన్నారు.ఏ.ఐ. కోర్సు ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా



ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్ ఫోన్స్ ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. జిల్లాలో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలలో ఏ ఏ కోర్సు ద్వారా విద్య బోధన జరుగుతుందని, ఇక్కడ వచ్చే ఫలితాలను అంచనా వేస్తూ భవిష్యత్తులో దీన్ని మరింత విస్తరించి ఎందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ లను ఉపయోగించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు ముందుగా విద్యార్థులు తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారితో వారికి ఎఫ్ఎల్ఎం తో వచ్చే ఫలితాలను వివరించాలని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చదవడం రాయడం లో ఇలాంటి ఇబ్బంది పడకుండా చూడాలని ఉంది ప్రధాన ఉద్దేశం కంప్యూటర్లు ఇతర సామాగ్రి కోసం స్వచ్ఛంద సంస్థలను ఇతర సంస్థలను నుంచి సహాయం తీసుకోవచ్చు అని తెలిపారు అలాగే ఆయా జిల్లాల్లో అవసరమైన సామాగ్రి ఇతర పరికరాలు వివరాలను తమకు పంపించాలని సెక్రెటరీ విద్యాశాఖ సెక్రటరీ సూచించారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం స్కానింగ్ సెంటర్ ల తనిఖీ

- మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి

**జగిత్యాల మార్చి 13 ప్రజా జ్యోతి:** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారంలింగ నిర్ధారణ చేసి పుట్టే పసిపాప ఆడపిల్లనా మగ పిల్లవాడా అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగిత్యాల ఆర్డిఓ శ్రీ ఏ మధుసూదన్ గారితో కలిసి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి మరియు పాత స్కానింగ్ సెంటర్స్ రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లను, ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్కానింగ్ సెంటర్లలో పేషంట్ల సౌలభ్యం కోసం కనీస వసతులు , వెంటిలేషన్ సౌకర్యం ,వెయిటింగ్ హాల్ , నిబంధనల ప్రకారం ఉన్నాయా అని చూశారు.స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని సరిపోల్చారు. నిబంధనలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్నట్లయితే ఆయా కేంద్రాల దరఖాస్తులను అనుమతి కొరకు సిఫారస్ చేస్తామని ఆర్డిఓ మధుసూదన్ గారు తెలిపారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు – లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, హెల్త్ సూపర్వైజర్ ఇండివర శ్యామ్ పాల్గొన్నారు.



## హోలీ శుభాకాంక్షలు పట్టణ ప్రజలకు

- తెలియని వ్యక్తులపై, వాహన చోదకులపై రంగులు విసురుతే కఠిన చర్యలు : సిఐ. ఏ నిరంజన్ రెడ్డి



**మెట్ పల్లి ప్రతినిధి, మార్చి 13, ప్రజాజ్యోతి:** మెట్ పల్లి, ఇబ్రహీం పట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన సీఐ నిరంజన్ రెడ్డి.సర్కిల్ పరిధిలోని ప్రజలు హోలీ పండుగను ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు మద్యం మత్తులో వాహనాలు నడపడం చేయకుండా చూసుకోవాలని, హోలీ పండుగను ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుపుకోరడానికి ప్రయత్నించాలి, సురక్షితమైన రంగులను ఉపయోగించండి, హానికరమైన రసాయనాలు ఉన్న రంగులను వాడకండి. ఇష్టపడని వ్యక్తులు, వాహనదారులపై రంగులు విసరడం కఠినంగా నిషేధించబడినది. పబ్లిక్ రోడ్లు బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం అసభ్యంగా ప్రవర్తించడం చట్ట విరుద్ధం. శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రజలు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే ఏ చర్యైన కఠినంగా ఎదురుకోబడును, ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలు హోలీ పండుగను ఆనందంగా సంతోషంగా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని కోరుకుంటున్నామని తెలుపుతున్న సీఐ నిరంజన్ రెడ్డి.

## సాంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకుందాం

- కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సురేష్ బాబు



**కోరుట్ల మార్చి 13 ప్రజాజ్యోతి ప్రతినిధి** జగిత్యాల జిల్లా కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సురేష్ బాబు సర్కిల్ పరిధిలోని ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, శాంతి భద్రతలకు భంగం కలగకుండా జరుపుకోవాలని సూచించారు. హోలీ సందర్భంగా అనవసరమైన వేధింపులు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తనను సహించ బోమని హెచ్చరించారు.ప్రధాన సూచనలు ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు హోలీ సందర్భంగా ఎవరికైనా బలవంతంగా రంగులు వేయడం, అనుమతి లేకుండా వాహనాలు, బహిరంగ ప్రదేశాలలో రంగులతో ఆడటం నిషేధం. మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి మహిళలల భద్రత విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెడతారని, అసభ్య ప్రవర్తనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలి రసాయనిక పదార్థాలు కలిగిన రంగులు చర్మానికి హానికరమైనవని, అందువల్ల ప్రకృతిసిద్ధమైన రంగులను ఉపయోగించాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దు మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దు సూచనలు తెలియజేశారు.

## ట్రాఫిక్ పోలీస్ ట్రెయినింగ్ ఇన్స్టిట్యూట్ ను సందర్శించిన విద్యార్థులు





**జగిత్యాల, మార్చి13, ప్రజాజ్యోతి** ట్రాఫిక్ అవగాహనలపైపట్టణంలోని అరవింద్ నగర్ లోని శ్రీనిధి స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ రోడ్డు దాటేటప్పుడు పాటించవలసిన ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, తదితర నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. తమ పెరెంట్స్ ఖచ్చితంగా హెల్మెట్ వాడేలా, సీట్ బెల్ట్ పెట్టుకొనేలా చూసే బాధ్యత మీపై ఉందని సూచించారు.అలాగే చిన్న పిల్లలు మైనర్లు వాహనాలను నడపవద్దని తెలిపారు తదుపరి జిల్లా పోలీసులు ట్రాఫిక్ రూల్స్ పై షార్ట్ ఫిల్మ్ ను ప్రొజెక్టర్ పై వీక్షింప చేశారు ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.